జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989894528

రంగారెడ్డి | శనివారం 11 ఏప్రిల్ 2026 | సంపుటి : 16 | సంచిక : 257 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# పునర్విభజనతో ప్రజా ఉద్యమం!

- లోక్‌సభ సీట్ల పెంపుతో రాష్ట్రాల మధ్య వివక్ష, అంతరాలు పెరుగుతాయి
- ఈ బిల్లును అడ్డుకోవాల్సి వస్తే నేను కాదు ప్రజలే తిరగబడతారు
- దేశంలో 50 శాతం నియోజకవర్గాల పెంపు జరిగితే ఉత్తరాదికే పూర్తి అడ్వాంటేజ్‌గా మారుతుంది
- కేవలం ఉత్తరాది రాష్ట్రాలతోనే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే దుస్థితి వస్తుంది.
- నియోజకవర్గాల పునర్విభజన పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర ద్రోహం
- ఢిల్లీలో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిట్‌చాట్



న్యూఢిల్లీ

లోక్‌సభ నియోజకవర్గాల పెంపు (పునర్విభుజన)తో రాష్ట్రాల మధ్య వివక్ష, అంతరాలు పెరుగుతాయని, ఫలితంగా ప్రజా ఉద్యమాలు తప్పవని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చిరించారు. రైతు చట్టాల్లాగే డీలిమిటేషన్ బిల్లును కూడా వెనక్కి తీసుకోకతప్పదని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రుభుత్వం దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర ద్రోహం చేస్తోందని అన్నారు. ఈ రాష్ట్రాలను రాజకీయంగా అణగదొక్కే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. ఇది పార్టీల సమస్య కాదని, ప్రాంతాల సమస్య అని చెప్పారు. 'ఇప్పటికే మేము తీవ్రమైన బాధతో ఉన్నాం.. గాయపడి ఉన్నాం.. మమ్మల్ని ఇంకా రెచ్చగొట్టొద్దు' అని హెచ్చరించారు. శుక్రవారం ఢిల్లీలో సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరైన అనంతరం.. రాత్రి తన అధికారిక నివాసంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'నియోజకవర్గాలను ఏ ప్రాతిపదికన, ఎలా పెంచాలి అనే దానిపై కనీస చర్చ లేకుండా ఎందుకింత అర్జెంటుగా? దేశంలో 50 శాతం నియోజకవర్గాల పెంపు జరిగితే ఉత్తరాదికే పూర్తి అడ్వాంటేజ్‌గా మారుతుంది. కేవలం ఉత్తరాది రాష్ట్రాలతోనే కేంద్రంలో ప్రభుత్వాన్ని - మిగతా 2లో



# చర్చలపై ప్రతిష్టంభన!

- రెండు వర్గాలుగా విడిపోయిన ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులు
- నేడు ఇస్లామాబాద్ చర్చలకు వెళ్లాల్సిందేనంటున్న ఒక వర్గం
- లెబనాన్‌పై దాడులు ఆపితేనే చర్చలంటున్న మరో వర్గం
- పాకిస్తాన్‌కు బయలుదేరిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్
- ఇరుపక్షాలను స్వాగతించడానికి సిద్ధమైన పాక్ సర్కార్

3



## మోదీ పొలిటికల్ గేమ్

- ఎన్నికల్లో లబ్ధి కోసమే
- పార్లమెంట్ ప్రత్యేక భేటీ
- అమలు లేని రిజర్వేషన్ ఎందుకు?...
- 'ఏప్రిల్ 16 నుంచి 18వ తేదీ వరకు పార్లమెంట్ సమావేశాలు
- కానీ ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి అధికారిక ప్రతిపాదన రాలేదు.
- సీడబ్ల్యూసీ సమావేశంలో మల్లికార్జున ఖర్గే


5

## ఆరు నెలల్లోనే ఉమ్మడి పౌరస్మృతి

- పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వస్తే చొరబాట్లకు అడ్డుకట్ట
- మహిళలు, యువత, రైతులు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం
- మహిళలకు నెలకు రూ.3 వేల చొప్పున ఆర్థిక సాయం
- ఉద్యోగాలు వచ్చేదాకా యువతకు నెలకు రూ.3 వేలు
- పూర్తిగా మహిళా పోలీసులతో 'దుర్గా సురక్ష స్క్వాడ్'ఏర్పాటు

బీజేపీ మేనిఫెస్టో విడుదల చేసిన అమిత్ షా

3





## అన్నా.. దేవుడే పంపిండు!

- కేసీఆర్ వద్ద మాజీమంత్రి జీవన్‌రెడ్డి భావోద్వేగం
- ఇన్నాళ్లకైనా మీతో కలిసి పనిచేసే అవకాశం రావడం సంతోషమన్న సీనియర్ నేత
- ఎర్రవల్లిలో బీఆర్ఎస్ అధినేతతో భేటీ..స్వాగతం పలికిన కేటీఆర్, పార్టీ నేతలు
- జీవన్‌రెడ్డిని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్న కేసీఆర్
- పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్న నేతలు..రాజకీయ పరిస్థితులపై చర్చ
- పార్టీలో అత్యంత ప్రాధాన్యం ఉంటుందని హామీ ఇచ్చిన మాజీ సీఎం
- 20న జగిత్యాలలో కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోనున్న జీవన్‌రెడ్డి

2లో

# అడవులు వీడిన మావోయిస్టులు



- డీజీపీ సమక్షంలో 42 మంది లొంగుబాటు
- 41 మంది ఛత్తీస్‌గఢ్.. తెలంగాణ నుంచి ఒకరు
- అందులో పీఎల్‌జీఏ బెటాలియన్ కమాండర్ కేశాలు
- 36 ఆయుధాలు, 800 గ్రాముల బంగారం అప్పగింత
- రూ.1.93 కోట్ల రివార్డు.. అందరికీ త్వరలోనే ఆరోగ్యకార్డులు

హైదరాబాద్

మావోయిస్టు ఉద్యమం ఆఖరుదశకు చేరుకున్న తరుణంలో అడవుల్లో మిగిలిపోయిన మరికొందరు మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారు. అజ్ఞాతం వీడి తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం ఆయుధాలు అప్పగించారు. మొత్తం 42 మంది మావోయిస్టులు 36 ఆయుధాలు, 1,007 తూటాలు, 2 గ్రెనేడ్లతోపాటు 800 గ్రాముల బంగారాన్ని అప్పగించి లొంగిపోయారు. వీరిలో 21 మంది మావోయిస్టులు 'మ్యాజిక్ వెపన్స్'లో కీలకమైన 'పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ)'కు చెందినవారే కావడంతో ఆ విభాగం కనుమరుగైపోయిందని డీజీపీ ప్రకటించారు. అలాగే మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీకి చెందిన 11 మంది(వీరంతా ఛత్తీస్‌గఢ్‌వారే) లొంగిపోవడంతో కమిటీ పూర్తిగా - మిగతా 2లో



## జస్టిస్ వర్మ రాజీనామా

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు రాజీనామా లేఖ
- 'తీవ్రమైన ఆవేదన'తో తప్పుకుంటున్నానని వెల్లడి
- స్పీకర్ ఓం బిర్లా నియమించిన కమిటీకి మరో లేఖ
- విచారణలో పాల్గొంటే న్యాయ వ్యవస్థకు అపకారం చేసినట్లేనని స్పష్టీకరణ

# అన్నా.. దేవుడే పంపిండు!

హైదరాబాద్

'తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీ దగ్గరికి పంపించిండు. అన్నా.. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్లకైనా మీతో కలిసి పనిచేసే అవకాశం రావడం సంతోషంగా వుంది..' అని ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నేత, మాజీమంత్రి టి.జీవన్‌రెడ్డి.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావుతో అన్నారు. బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు గురువారం ప్రకటించిన జీవన్‌రెడ్డి శుక్రవారం ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌తో భేటీ అయ్యారు.

తొలుత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుష్పగుచ్ఛం ఇచ్చి జీవన్‌రెడ్డికి స్వాగతం పలికారు. మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే డా.కె.సంజయ్, మాజీ ఎంపి జోగినపల్లి సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కె.విద్యాసాగర్‌రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. జీవన్‌రెడ్డి వెంట ఆయన కుమారులు రామచంద్రారెడ్డి, బాలకృష్ణారెడ్డి, చంద్రకృష్ణారెడ్డితో పాటు జగిత్యాల మాజీ జెడ్పీ ఛైర్‌పర్సన్ దావా వసంత సురేశ్ కూడా ఎర్రవల్లికి వచ్చారు. కాగా జీవన్‌రెడ్డిని ఆత్మీయ ఆలింగనం చేసుకున్న కేసీఆర్.. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి తన నివాసంలోకి ఆహ్వానించారు. ఈ సమయంలోనే జీవన్‌రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ నేతల సమక్షంలో ఇష్టాగోష్టి అనంతరం జీవన్‌రెడ్డి బృందానికి కేసీఆర్ ఆతిథ్యం ఇచ్చారు. అనంతరం కేసీఆర్, జీవన్‌రెడ్డి నడుమ సుదీర్ఘ చర్చ జరిగింది. బీఆర్ఎస్‌లో జీవన్‌రెడ్డి చేరికకు తేదీ ఖరారైంది.

**రాజకీయ పరిస్థితులపై చర్చ**

రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులపై కేసీఆర్, జీవన్‌రెడ్డి చర్చించుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. సుమారు 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎదురైన అనుభవాలను గుర్తు చేసుకోవడంతో పాటు, పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నట్లు తెలిసింది. తెలంగాణ ఉద్యమం, పదేళ్ల బీఆర్ఎస్ పాలన వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి పాలనా తీరు తదితరాలపై చర్చ జరిగినట్లు తెలిసింది. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి ప్రస్తుతం తిరోగమన దిశలో ఉందనే కోణంలో సుదీర్ఘ చర్చ జరిగినట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్



ప్రభుత్వ పాలనా వైఫల్యంతో తెలంగాణకు నష్టం జరుగుతోందని ఇరువురు నేతలు అభిప్రాయపడినట్టు తెలుస్తోంది.

**జగిత్యాలలో 2 లక్షల మందితో సభ**

జీవన్‌రెడ్డి ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలకు జగిత్యాలలో జరిగే బహిరంగ సభ వేదికగా కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోనున్నారు. బహిరంగ సభ నిర్వహణకు అవసరమైన సన్నాహాలు ప్రారంభించాల్సిందిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన నేతలకు ఆదేశాలు అందాయి. సభ నిర్వహణ బాధ్యతను మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో పాటు స్థానిక నేతలకు అప్పగించినట్లు సమాచారం. సభ నిర్వహణకు అనువైన ప్రదేశాన్ని శనివారం బీఆర్ఎస్ నేతలు సందర్శించి ఖరారు చేయనున్నారు. సుమారు 2 లక్షల మందితో సభ నిర్వహించేలా మైదానం ఎంపిక చేయాలని కేసీఆర్ ఆదేశించినట్లు సమాచారం. జీవన్‌రెడ్డికి బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ పదవి ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిసింది. గతంలో రాజ్యసభ మాజీ సభ్యుడు కె.కేశవరావు ఈ పదవిలో కొనసాగారు. కాగా జీవన్‌రెడ్డికి ఉన్న రాజకీయ అనుభవం, సీనియారిటీని దృష్టిలో పెట్టుకుని ఆయనకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలనే యోచనలో కేసీఆర్ ఉన్నట్లు సమాచారం. ముఖాముఖి సమావేశం సందర్భంగా పార్టీలో అత్యంత ప్రాధాన్యత ఉంటుందని జీవన్‌రెడ్డికి కేసీఆర్ హామీ ఇచ్చినట్లు తెలిసింది.

**కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణపై పట్టు కోల్పోయింది**

తెలంగాణపై కాంగ్రెస్ అధిష్టానం పట్టు కోల్పోయిందని మాజీమంత్రి టి.జీవన్‌రెడ్డి విమర్శించారు. అయితే తన విషయంలో పీసీసీ తప్పు చేసింది కానీ ఏఐసీసీని నిందించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు తిరోగమనంలో పయనిస్తోందన్నారు. శుక్రవారం కేసీఆర్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఒకప్పుడు పీసీసీ ఏది చెబితే ముఖ్యమంత్రులు అది చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కడే ఏకపక్షంగా, రూలర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం పీసీసీ అనేది కేవలం సీఎం అదేశాలను అమలు చేసే ఒక విభాగంగా మారిపోయింది.

మరోవైపు రేవంత్‌రెడ్డి పాలనతో ప్రజలు విసిగిపోయారు. మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని బలంగా కోరుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చి న వాగ్దానాలను నెరవేర్చలేదు. ఈ విషయంలో ప్రజల పక్షాన పోరాడేందుకు బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నా..' అని జీవన్‌రెడ్డి తెలిపారు. తనకు 14 సార్లు బీ ఫామ్ ఇచ్చారంటే కంటెంట్ ఉన్న నాయకుడినే కాబట్టే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని ఆయన అన్నారు. కాగా జీవన్‌రెడ్డి ఈ నెల 20న బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణలు మీడియాకు తెలిపారు.

# భూముల విలువల పెంపు నివేదిక ఇవ్వండి

హైదరాబాద్

రాష్ట్రంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ప్రభుత్వ విలువల పెంపు కోణంలో జరిగిన అధ్యయన నివేదికను వెంటనే సమర్పించాలని, రానున్న కేబినెట్ సమావేశంలో ఈ నివేదికను ప్రవేశపెట్టి చర్చించేందుకు వీలుగా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. భూముల విలువల పెంపు ద్వారా ప్రజలపై పెద్ద ఎత్తున భారం పడకుండా ఈ నివేదికలను తయారు చేయాలని ఆయన సూచించారు. శుక్రవారం సచివాయంలో డిప్యూటీ సీఎం భట్టి అధ్యక్షతన ఆదాయ సృష్టి, వనరుల సమీకరణపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉపసంఘం సభ్యులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీఎస్ కె.రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాలతోపాటు ఆదాయార్జన శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా మెట్రో రైల్ స్వాధీనం, నిర్వహణ, ఆదాయ, వ్యయ మార్గాలపైన అధికారులతో మంత్రులు చర్చించారు. ఎక్సైజ్, రెవెన్యూ, పరిశ్రమల శాఖల్లో ఆదాయ పెంపునకు గల అవకాశాలు, ఫలితాలపై సమీక్షించారు.

**వనరుల సమీకరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోండి**

ఈ సమీక్షలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ కృత్రిమ మేధ(ఏఐ) లాంటి ఆధునిక సాంకేతికతను




వినియోగించుకోవడం ద్వారా ఆదాయార్జన శాఖల రాబడులు, పన్నులు పెరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. విజన్--2047 లక్ష్యంగా ఆదాయ పెంపునకు అవసరమైన వనరుల సమీకరణ కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇసుక, క్రషర్ మైనింగ్ విభాగాల్లో అక్రమ రవాణా, ఓవర్ లోడ్‌లను నియంత్రించడం ద్వారా ఆదాయం పెంచాలని కోరారు. వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ల శాఖలో కూడా ఆదాయం పెరుగుతోందని, ఈ శాఖల్లోనూ ఆదాయ వనరుల పెంపునకు గల అవకాశాలను అన్వేషించాలని సూచించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో భూముల విక్రయానికి సంబంధించిన ప్రచారాన్ని ప్రపంచ స్థాయిలో నిర్వహించాలని, అందరికీ ముందస్తు సమాచారం అందించడం ద్వారా ఆదాయ వనరులు పెరిగే అవకాశముంటుందన్నారు.

# తెలంగాణలో 2 లక్షల రేషన్ కార్డుల రద్దు

హైదరాబాద్

రాష్ట్రంలో రేషన్ కార్డుల అనర్హుల జాబితాను గుర్తించే పనిలో అధికారులు పడ్డారు. విజిలెన్స్ అధికారులు రహస్యంగా ఆడిట్ నిర్వహించగా.. భారీగా అవకతవకలు ఉన్నట్లు తేలింది. దీంతో ఆ రేషన్ కార్డులను రద్దు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. అంతేకాకుండా రేషన్ కార్డు ద్వారా ఇప్పటివరకు పొందిన సబ్సిడీని కూడా రికవరీ చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఇప్పుడు రేషన్ కార్డుదారుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.తెలంగాణలో అనర్హులకు 1.40 లక్షల రేషన్ కార్డులను రద్దు చేసినట్లు ఇటీవలె కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బాంభానియా పార్లమెంటుకు చెప్పిన సంగతి తెలిసిందే. మరోవైపు రేవంత్ రెడ్డి సర్కార్ కూడా అనర్హులు కలిగి ఉన్న రేషన్ కార్డుల ఏరివేత ప్రక్రియను ముమ్మరంగా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే తెలంగాణ విజిలెన్స్ విభాగం.. గుట్టు చప్పుడు కాకుండా.. రేషన్ కార్డులకు సంబంధించి రహస్య ఆడిట్ నిర్వహించగా అందులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్‌లోనే ఏకంగా 2 లక్షల మంది అనర్హులు రేషన్ కార్డులు కలిగి ఉన్నారని తేలింది.పాన్ కార్డు, గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) నంబర్లను రేషన్ కార్డు డేటాతో విజిలెన్స్ అధికారులు లింక్ చేయగా.. కీలక విషయాలు బయటపడినట్లు తెలుస్తోంది. ఒక్క హైదరాబాద్ నగరంలోనే దాదాపు 2 లక్షల మంది ఆదాయపు పన్ను (ఇన్‌కం ట్యాక్స్) చెల్లించే వారు రేషన్ కార్డులను పొందినట్లు వెల్లడైంది. దీనికి సంబంధించి ఇప్పటికే 80 శాతం వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఐటీ పన్ను చెల్లించేవారు, ప్రభుత్వ ఉద్యోగుల రేషన్ కార్డులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాఫ్ట్‌వేర్‌తో విజిలెన్స్ అధికారులు గుర్తించడం గమనార్హం.మరోవైపు.. అనర్హులుగా తేలిన వారి రేషన్ కార్డులను రద్దు చేయడంపై ఇప్పుడు అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలోనే కేవలం రేషన్ కార్డులను రద్దు చేయడం మాత్రమే కాకుండా వారు పొందిన సబ్సిడీని కూడా తిరిగి వసూలు చేసేలా చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు కూడా రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటివరకు రేషన్ కార్డులు పొందిన అనర్హుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత భారీగా రేషన్ కార్డులను జారీ చేసింది.

## పునర్విభజనతో ప్రజా ఉద్యమం!

-మొదటిపేజీ తరువాయి

ఏర్పాటు చేసుకునే దుస్థితి వస్తుంది. చిన్న రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరగడమే కాకుండా ప్రాముఖ్యత కోల్పోతాయి. చిన్న రాష్ట్రాలు మరింత చిన్నగా, పెద్ద రాష్ట్రాలు మరీ పెద్దగా మారిపోతాయి. ఆర్థిక ప్రాతిపదికన, మెరిట్ డిజబిలిటీ విధానంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పెంపు ఉండాలి. చిన్న రాష్ట్రాలు, పెద్ద రాష్ట్రాల మధ్య ఇప్పుడున్న గ్యాప్ అలాగే కొనసాగాలి. ప్రస్తుతం కేరళ, యూపీ మధ్య 60 సీట్ల తేడా ఉంది. పునర్విభజన జరిగితే అది ఏకంగా 99కి పెరుగుతుంది. ఇది ముమ్మాటికీ చిన్న రాష్ట్రాలకు ఉరితాడు లాంటిదే. భవిష్యత్తులో ఉత్తరాది సీట్లు పెరిగితే.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంలో చోటు దక్కించుకున్న బండి సంజయ్, కిషన్‌రెడ్డి లాంటి దక్షిణాది బీజేపీ నేతలకు కనీసం చప్రాసీ పదవి కూడా దొరకదు..' అని సీఎం అన్నారు.

**అందమైన ముసుగులో మోసం**

'నియోజకవర్గాల పెంపు అనేది అందమైన ముసుగులో చేస్తున్న మోసం. బీజేపీ పెడుతున్న ఈ మెలికల్లో వారి రాజకీయ స్వార్థం దాగుంది. గతంలో ఇలాగే హడావుడి చేసి రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చారు. రైతుల ఆందోళనతో మళ్లీ వెనక్కి తీసుకున్నారు. ఇప్పుడు ఈ బిల్లుపై సౌత్‌లో రియాక్షన్ వస్తే, బీజేపీ పాలిత చిన్న రాష్ట్రాలు సహా.. ఇతర చిన్న రాష్ట్రాలు వ్యతిరేకిస్తే కేంద్రం ఏం చేస్తుంది? ఈ బిల్లును అడ్డుకోవాల్సి వస్తే నేను కాదు ప్రజలే తిరగబడతారు.

**మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదు..**

మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదు. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లను దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ అమలు చేశారు. సోనియాగాంధీ గతంలోనే మహిళా రిజర్వే షన్ బిల్లును పెట్టారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల కోసం సీట్లు పెంచాల్సిన అవసరం ఏముంది? ఇప్పుడున్న 543 లోక్‌సభ స్థానాల్లోనే 181 సీట్లను మహిళలకు కేటాయించి రిజర్వేషన్లు అమలు చేయొచ్చు కదా? కేంద్రం లీకులు ఇస్తున్న ఇతర సవరణలపై ఇండియా కూటమితో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సీడబ్ల్యూసీ సమావేశంలో నిర్ణయించాం..' అని రేవంత్ తెలిపారు.

**కేటీఆర్ వ్యాఖ్యలు సిగ్గుచేటు**

కాంగ్రెస్ పార్టీలో సీనియర్లకు అవమానం జరిగిందని బీఆర్ఎస్ నేత కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటని రేవంత్‌రెడ్డి విమర్శించారు. 'గతంలో బీఆర్ఎస్‌లో సీనియర్లుగా ఉన్న ఆలె నరేంద్ర, దేశిని చిన్న మల్లయ్య, ఈటల రాజేందర్, విజయశాంతి లాంటి ఎంతోమందికి ఏం జరిగిందో, వారిని ఎలా గెంటేశారో అందరికీ తెలుసు..' అని వ్యాఖ్యానించారు.

## అడవులు వీడిన మావోయిస్టులు

-మొదటిపేజీ తరువాయి

ఉనికి కోల్పోయిందని స్పష్టం చేశారు. మిగిలిన 10 మంది దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ(డీకేఎస్‌జడ్‌సీ)కి చెందినవారని చెప్పారు. లొంగిపోయిన వారిలో పీఎల్‌జీఏ బెటాలియన్ కమాండర్ సభ్యుడు సోడి మల్లా ఎలియాస్ కేశాలు.. జేఎంఎండబ్ల్యూపీ డివిజనల్ కమిటీ కార్యదర్శి చాప నారాయణ ఎలియాస్ మధు.. బీకే-ఏఎస్ఆర్ డివిజనల్ కమిటీ సభ్యుడు కడ్తి సన్ను ఎలియాస్ మంతు ముఖ్యులు కాగా.. తెలంగాణకు చెందిన మావోయిస్టు కుంజం ఇడుమాల్ సైతం ఉన్నారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం తడపాల గ్రామానికి చెందిన ఇడుమాల్ ఏరియా కమిటీ సభ్యుడి(ఏసీఎం)గా పనిచేస్తూ లొంగిపోయారు. మిగిలిన 41 మంది చత్తీస్‌గఢ్‌కు చెందినవారే కావడం గమనార్హం. వీరందరిపై రూ.1.93కోట్ల రివార్డున్నట్లు పోలీసులు ప్రకటించారు. తెలంగాణకు చెందిన వ్యక్తి కావడంతో ఇడుమాల్‌కు ఏసీఎం హోదాలో రూ.4లక్షల రివార్డును అందజేయగా.. మిగిలినవారికి రూ.25వేల చొప్పున తక్షణ ఆర్థికసాయంగా అందించారు. ఆయుధాలతోసహా లొంగిపోయినందుకు వీరికి హోదాను బట్టి అందించాల్సిన పరిహారాన్ని ఆధార్, పాన్‌కార్డులతోపాటు బ్యాంకు ఖాతాలు సమకూరిన తర్వాత అందజేయనున్నారు. స్వస్థలాలతో సంబంధం లేకుండా తెలంగాణలో లొంగిపోయినందుకు వీరందరికీ ఆరోగ్యకార్డులను త్వరలోనే సమకూర్చనున్నట్లు డీజీపీ వెల్లడించారు. కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్, గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ అనిల్‌కుమార్, శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీ(ఇన్‌ఛార్జి) స్వాతిలక్రా, ఎస్ఐబీ చీఫ్ సుమతి పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీకి చెందిన సుపో ఉంగా ఎలియాస్ సునీల్ బంగారాన్ని పోలీసులకు అప్పగించారు.

**తెలంగాణలో మిగిలింది ఐదుగురే..**

మావోయిస్టు పార్టీలో తెలంగాణ నుంచి 2023లో 125 మంది క్యాడర్ ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య ఐదుకు పడిపోయింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు ఎలియాస్ గణపతి, పసునూరి నరహరి ఎలియాస్ సంతోష్‌తోపాటు రాష్ట్రకమిటీ సభ్యులు జోడె రత్నాభాయి ఎలియాస్ సుజాత, వార్త శేఖర్ ఎలియాస్ మంగ్తూ, ఏరియా కమిటీ సభ్యురాలు రంగబోయిన భాగ్య ఎలియాస్ రూపి మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారు.

**అడవుల్లో లేకున్నా గణపతి బతికే ఉన్నారు: డీజీపీ శివధర్‌రెడ్డి**

మావోయిస్టుల లొంగుబాటు సందర్భంగా మీడియా అడిగిన పలు ప్రశ్నలకు డీజీపీ శివధర్‌రెడ్డి సమాధానాలిచ్చారు. తెలంగాణ ఇప్పటికే మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారిందన్నారు. ఐదుగురు నేతలు అజ్ఞాతంలో ఉన్నప్పటికీ రాష్ట్రంతో సంబంధం లేకుండా ఇతర ప్రాంతాల్లో ఉండటంతో రాష్ట్రంలో పూర్తిగా మావోయిస్టుల కార్యకలాపాలు ముగిసిపోయాయన్నారు. గణపతి బతికే ఉన్నట్లు తమ వద్ద సమాచారముందని.. అయితే అడవుల్లో మాత్రం లేరని స్పష్టం చేశారు. లొంగిపోయిన మావోయిస్టుల పరిస్థితి దయనీయంగా ఉందంటూ సీపీఐ నేత నారాయణ చేసిన వ్యాఖ్యల గురించి ప్రశ్నించగా.. అజ్ఞాతంలో కంటే ఇప్పుడే మావోయిస్టులు బాగున్నారని స్పష్టం చేశారు. తమవి లొంగుబాట్లు కావు, అరెస్టులంటూ అడవుల్ని వీడిన కొందరు అగ్రనేతలు చెబుతున్నారనే విషయంపై స్పందిస్తూ.. తాము లొంగిపోయామంటే అగౌరవంగా ఉంటుందనే భావనతో అలా చెప్పి ఉండొచ్చు అన్నారు.

## నేటి నుంచి ట్రాఫిక్ మళ్లింపులు.. మార్గాలు ఇవే

హైదరాబాద్



మెహిదీపట్నం రైతుబజార్, బస్‌స్టాప్ జరుగుతున్న స్కైవాక్ నిర్మాణ పనుల దృష్ట్యా, ట్రాఫిక్ రద్దీని నివారించడానికి ఈ రోజు (శుక్రవారం) రాత్రి 12 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు ఈ క్రింది విధంగా ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయని అధికారులు ట్రఫిక్ అడ్వయిజరీ జారీ చేశారు.. మాసబ్ ట్యాంక్, చీవీణజ, ఎస్.డి.ఐ హాస్పిటల్ వైపు నుండి రేతిబౌలి-నానల్ నగర్ వైపు వెళ్లే వాహనాలను పి.వి.ఎన్.ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నెం. 2 డ 3 (అజీజియా మసీదు) వద్ద మళ్లిస్తారు.ఈ వాహనాలు మెరాజ్ కేఫ్ వద్ద కుడి వైపుకు తిరిగి, మెహిదీపట్నం పిల్లర్ నెం. 15 వద్ద తిరిగి ప్రధాన మార్గంలోకి చేరుకోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా నగర ప్రయాణీకులు ఎప్పటికప్పుడు తాజా ట్రాఫిక్ అప్‌డేట్ల కోసం మా సోషల్ మీడియా వేదికలైన హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ఫేస్‌బుక్ పేజీ (ఖుషవఎశీశీ౧.షశీ/ న్ఖు) ఎక్స్‌ట్విట్టర్ హ్యాండిల్ ఏన్ఖు ను అనుసరించాల్సిందిగా ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితిల్లో ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నెంబర్: 9010203626 కాల్‌చేయాలని హైదరాబాద్

# చర్చలపై ప్రతిష్టంభన!

**ఇస్లామాబాద్**

పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించి, శాంతిని సాధించడమే ధ్యేయంగా శనివారం పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరగాల్సిన చర్చలపై ప్రతిష్టంభన నెలకొంది. చర్చల విషయంలో ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గతంగా విభేదాలు తలెత్తినట్లు సమాచారం. ఇరాన్ ప్రతినిధులు రెండు వర్గాలుగా విడిపోయారు. తమ వాదన నుంచి వెనక్కి తగ్గడం లేదు. శాంతి చర్చలకు తప్పనిసరిగా హాజరు కావాలని ఒకవర్గం పట్టుబడుతుండగా, మరో వర్గం అందుకు ససేమిరా ఒప్పుకోవడం లేదు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆపితేనే చర్చలంటూ మెలిక పెడుతోంది. మొత్తానికి శాంతి చర్చలకు ఇరాన్ హాజరవుతుందా? లేదా? అనేది అనుమానంగానే మారింది. శుక్రవారం రాత్రి వరకూ ఎటూ తేల్చుకోకపోవడం గమనార్హం. మరోవైపు చర్చలకు అమెరికా సిద్ధమవుతోంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ శుక్రవారం ఇస్లామాబాద్‌కు బయలుదేరారు. చర్చలు సానుకూలంగా, ఫలప్రదంగా జరుగుతాయని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. శాంతి చర్చల పట్ల ఇరానియన్లకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే స్నేహహస్తం అందిస్తామని తెలిపారు. ఒకవేళ వారు తమతో ఆడుకోవాలని చూస్తే తదుపరి పరిణామాలు మరోలా ఉంటాయని తమ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించినట్లు పేర్కొన్నారు. చర్చల విషయంలో ట్రంప్ కొన్ని స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారని వాన్స్ వెల్లడించారు.



**రెండు అంశాలు పరిష్కారమైతేనే...**

ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న శాంతి చర్చల నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నగరంలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. 10 వేల మందికిపైగా భద్రతా సిబ్బంది మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బహుళ అంచెల రక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేశారు. ఈ చర్చలను పాక్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. అయితే, ఇరాన్ ప్రతినిధి బృందం రాకపై అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదు.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆగకపోతే ఇస్లామాబాద్ చర్చల నుంచి పూర్తిగా వైదొలుగుతామని టెహ్రాన్ హెచ్చరించినట్లు ఇరాన్ అధికారిక తస్నిమ్ వార్తా సంస్థ వెల్లడించింది. పరస్పరం అంగీకరించిన రెండు అంశాలు ఇప్పటికీ అమలు కాలేదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘెర్ ఘలిబాఫ్ శుక్రవారం విమర్శించారు. లెబనాన్‌లో కాల్పుల విరమణ పాటించడం లేదని, ఇరాన్‌కు సంబంధించిన కొన్ని ఆస్తులను ఇప్పటికీ విడుదల చేయలేదని తప్పుపట్టారు. శాంతి చర్చలు ప్రారంభం కావాలంటే ఈ రెండు అంశాలు అమల్లోకి రావాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఇరాన్ నుంచి పది మందితో కూడిన ప్రతినిధి బృందం చర్చలకు రాబోతోందని పాకిస్తాన్‌లోని ఇరాన్ రాయబారి రెజా అమీర్ మొఘదామ్ గురువారం నిర్ధారించారు. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉండడం గమనార్హం. అయితే, ఇరాన్ ప్రతినిధి బృందం రాకను ఉద్దేశపూర్వకంగానే రహస్యంగా ఉంచారని, వారి కోసం పాక్ ప్రభుత్వం ప్రత్యేకంగా సెక్యూరిటీ కారిడార్‌ను ఏర్పాటు చేసిందని సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది.

**దాడులు జరుగుతుండగానే చర్చలా?**

లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగించడం ప్రాథమిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమే అవుతుందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ స్పష్టంచేశారు. ఒకవైపు దాడులు కొనసాగుతుండగానే మరోవైపు చర్చలు జరపడం అర్థంపర్థం లేని పని అంటూ తేల్చేశారు. ఇదిలా ఉండగా, ఇస్లామాబాద్‌లో చర్చలకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఇరుపక్షాలను స్వాగతించడానికి పాక్ సర్కార్ సిద్ధమయ్యింది. చర్చల కోసం వచ్చే ప్రతినిధులకు, విలేకరులకు 'వీసా ఆన్ అరైవల్'కింద వీసాలు ఇవ్వనున్నట్లు పాక్ ఉప ప్రధానమంత్రి ఇషాఖ్ దార్ శుక్రవారం తెలిపారు.

**పాక్ మంత్రికి మునీర్ మందలింపు**

మానవాళికి శాపం ఇజ్రాయెల్, అదొక దయ్యం, క్యాన్సర్ అంటూ దూషించిన పాక్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా అసిఫ్‌ను ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ తీవ్రంగా మందలించారు. ఆయనపై పెద్ద ఎత్తున కేకలు వేసినట్లు తెలిసింది. బాధ్యత లేకుండా వ్యవహరించడం ఏమిటని మండిపడినట్లు సమాచారం. ఇజ్రాయె ల్‌ను దూషిస్తూ సోషల్ మీడియాలో చేసిన పోస్టును ఖవాజా అసిఫ్ తర్వాత తొలగించారు.

# ఆరు నెలల్లోనే ఉమ్మడి పౌరస్మృతి

**కోల్‌కతా**

పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వస్తే ఆరు నెలల్లోనే ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) అమలు చేస్తామని బీజేపీ ప్రకటించింది. పొరుగుదేశాల నుంచి చొరబాట్లకు పూర్తిగా అడ్డుకట్ట వేస్తామని స్పష్టంచేసింది. రాష్ట్రంలో ప్రధానంగా మహిళలు, యువత, రైతులు, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించింది. వారి కోసం సంక్షేమ పథకాలను విస్తరింపజేస్తామని హామీ ఇచ్చింది. బెంగాల్‌లో బీజేపీ మేనిఫెస్టో 'సంకల్ప పత్ర'ను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా శుక్రవారం విడుదల చేశారు. సోనార్ బంగ్లా(బంగారు బెంగాల్)కు ఇదొక రోడ్ మ్యాప్ అని ఆయన అభివరి?ణంచారు. అవినీతి, రాజకీయ హింస, చొరబాట్లు, నిరుద్యోగ సమస్యకు ఈ అసెంబ్లీ ఎన్నికలు ఒక రెఫరెండమ్ అని తేల్చిచెప్పారు.

**మహిళలకు ఉచిత ప్రయాణం**

రాష్ట్ర సరిహద్దుల్లో భద్రతను పటిష్టం చేస్తామని బీజేపీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూముల్లో తిష్టవేసిన ఆక్రమణదారులను, చొరబాటుదార్లను అక్కడి నుంచి వెళ్లగొడతామని పేర్కొన్నారు. ఆయా భూములకు విముక్తి కల్పిస్తామని తెలిపారు. ప్రజా రవాణా సంస్థ వాహనాల్లో మహిళల ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు రూ.15,000 చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రకటించారు.

అధికార పార్టీ అవినీతి వ్యవహారాలు, ఉపాధ్యాయ నియామకాల్లో కుంభకోణం వల్ల ఉద్యోగాలు కోల్పోయినవారికి ఐదేళ్లపాటు వయసు సడలింపు ఇస్తామని చెప్పారు. ఉద్యోగాలను పారదర్శకంగా, నైపుణ్యాల ఆధారంగా భర్తీ చేస్తామని స్పష్టంచేశారు. అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే ఉద్యోగుల కోసం ఏడో వేతన సవరణ సంఘం సిఫార్సులు అమలు చేస్తామని వెల్లడించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు ఏటా రూ.9,000 చొప్పున అందజేస్తామని పేర్కొన్నారు.

**చేపలు, గుడ్లపై నిషేధం ఉండదు: అమిత్ షా**

బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాలీ బిడ్డనే పశ్చిమ బెంగాల్‌కు ముఖ్యమంత్రిని చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. బీజేపీకి అధికారం అప్పగిస్తే చేపలు, గుడ్లపై నిషేధం విధిస్తారంటూ కొందరు దు?రప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి నిషేధం ఉండదని స్పష్టంచేశారు.

**బీజేపీ సంకల్ప పత్రలో కీలకాంశాలు..**

బెంగాల్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమలు కోసం చట్టం.
అక్రమ వలసలపై కఠిన చర్యలు. పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట.
ప్రజలు తమకు నచ్చిన మతాన్ని స్వేచ్ఛగా ఆచరించేలా చట్టం.
మహిళలకు ప్రతినెలా రూ.3,000 చొప్పున ఆర్థిక సాయం. వారి సాధికారతకు చేయూత.
పోలీసు శాఖలో ప్రత్యేకంగా మహిళా బెటాలియన్ 'దుర్గా సురక్ష స్క్వాడ్'ఏర్పాటు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు.
కోటి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభించేదాకా నెలకు రూ.3,000 చొప్పున ఆర్థిక సాయం.
ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కరువు భత్యం కేంద్ర రేట్లకు అనుగుణంగా మార్పు. ఏడో వేతన కమిషన్ సిఫార్సుల అమలు.
15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలు, దిగజారిన శాంతి భద్రతలపై శ్వేతపత్రం విడుదల.
కట్ మనీ(చట్టవిరుద్ధమైన కమిషన్లు/లంచాలు) సంస్కృతికి చరమగీతం. సిండికేట్ వ్యవస్థ అంతం.
ఆయుష్మాన్ భారత్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలు బెంగాల్‌లోనూ అమలు. ఉత్తర బెంగాల్ జిల్లాల్లో ఎయిమ్స్, ఐఐటీ, ఐఐఎం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్ ఏర్పాటు.
వరి, బంగాళదుంప, మామిడి పండించే రైతులకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక ప్రోత్సాహకాలు. పంటలకు గిట్టుబాటు ధరలు.
రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లోకి కుర్మాలీ, రాజ్‌బన్షీ భాషలు.
అత్యున్నత పారిశ్రామిక హబ్‌గా బెంగాల్ అభివృద్ధి.
అతిపెద్ద చేపల ఎగుమతి కేంద్రం ఏర్పాటు.
పాత తేయాకు తోటల పునరుద్ధరణ. డార్జీలింగ్ తేయాకుకు గ్లోబల్ బ్రాండ్ గుర్తింపు లభించేలా చర్యలు. జనపనార పరిశ్రమ ఆధునీకరణ.
రాష్ట్రంలో వందేమాతరం మ్యూజియం నిర్మాణం.

# రూ.1,856 కోట్ల నిఘా డ్రోన్ కనిపించుట లేదు

ఇరాన్‌పై యుద్ధంలో అమెరికాకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. నావికాదళానికి చెందిన అత్యంత ఖరీదైన నిఘా డ్రోన్‌ను అగ్రరాజ్యం కోల్పోయినట్టు సమాచారం. గురువారం హార్మూజ్ జలసంధి సమీపంలో గగనతలంలో సీక్రెట్ మిషన్ సందర్భంగా ఉదంతం చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. ఎంక్యూ--4సీ ట్రైటాన్‌గా పిలిచే ఈ డ్రోన్ ఖరీదు ఏకంగా 20 కోట్ల డాలర్లు (రూ.1,856 కోట్లు) కావడం గమనార్హం. రాడార్ల నుంచి హఠాత్తుగా అదృశ్యం కావడం సంచలనాత్మకంగా మారింది. ప్రస్తుతానికి కనిపించడం లేదు. ఎంక్యూ--4సీ ప్రమాదవశాత్తూ డ్రోన్ కూలిపోయిందా? లేక ఇరాన్ సైన్యం కూల్చివేసిందా? అనేది నిర్ధారణ కాలేదు. ఈ నిఘా డ్రోన్‌ను 2018లో అమెరికా సైన్యంలో ప్రవేశపెట్టారు. యుద్ధంలో కోల్పోవడం ఇదే మొదటిసారి. పశ్చిమాసియా యుద్ధంలో అమెరికా ఇప్పటికే భారీగా నష్టపోయింది. ఎఫ్--15ఇ, ఎ--10 వంటి ఆధునిక యుద్ధ విమానాలు నేలకూలాయి. ఎంక్యూ--4సీను కోల్పోవడంతో ఆ నష్టం మరింత పెరుగుతోంది. తొమ్మిది ఎంక్యూ--9 రీపర్ డ్రోన్లను కూడా అమెరికా నష్టపోయింది. మొత్తానికి పశ్చిమాసియా యుద్ధం అమెరికాకు అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారిపోయింది. ఎంక్యూ--4సీ డ్రోన్ ఆచూకీ కోసం అమెరికా సైన్యం గాలిస్తున్నప్పటికీ ఆశించిన ఫలితం కనిపించడం లేదు. హార్మూజ్ జలసంధిపై మూడు గంటల మిషన్ తర్వాత ఈ డ్రోన్ ఇటలీ దేశం సిగోనెల్లాలోని తన స్థావరానికి తిరిగి వస్తుండగా కనిపించకుండా పోయింది. అదృశ్యమయ్యే ముందు అత్యంత వేగంగా కిందికి దిగినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటా చూపుతోంది. కేవలం కొన్ని సెకండ్ల వ్యవధిలోనే 50 వేల అడుగుల ఎత్తు నుంచి 10 వేల అడుగుల ఎత్తుకు దిగినట్లు చెబుతోంది. అత్యంత అధునాతనమైన మానవరహిత నిఘా డ్రోన్లలో ఒకటైన ఎంక్యూ--4సీ ట్రైటాన్ తొలుత సౌదీ అరేబియా గగనతలంలోకి ప్రవేశించి ఆకస్మికంగా ఇరాన్ వైపు మళ్లింది. రాడార్ నుంచి అదృశ్యమయ్యే ముందు 7700 అనే కోడ్‌ను పంపించింది. ఇది ఒక అత్యవసర సంకేతం. అయితే, ఆ అత్యవసర పరిస్థితి ఏమిటన్నదానిపై ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. అసలు హార్మూజ్ గగనతలంలోకి నిఘా డ్రోన్ ఎందుకు వెళ్లిందన్నది తెలియరాలేదు. పర్షియల్ గల్ఫ్ చుట్టుపక్కల పర్యవేక్షణ కోసం అమెరికా నావికాదళం గత నెల రోజులుగా ఎంక్యూ--4సీ ట్రైటాన్‌ను ఉపయోగిస్తోంది.

కాల్పుల విరమణ ఒప్పందానికి ఒకరోజు ముందు ఈ నెల 7వ తేదీన ఈ డ్రోన్ ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్‌పై చక్కర్లు కొట్టిందని చెబుతున్నారు. గతవారం ఎఫ్--15ఇ ఫైటర్ జెట్‌ను ఇరాన్ కూల్చివేసిన తర్వాత సహాయక చర్యల్లో డ్రోన్ పాలుపంచుకుంది. ఇది సాధారణ డ్రోన్ కాదు. సుదీర్ఘ కాలంపాటు సముద్ర నిఘా, పర్యవేక్షణ కోసం రూపొందించారు. 24 గంటలపాటు గాల్లో ఆగకుండా ఎగరగలదు. అమెరికా సైన్యానికి తురుపుముక్క లాంటి డ్రోన్ అదృశ్యం కావడం, ఇప్పటికీ ఆచూకీ లేకపోవడం మిస్టరీగా మారింది.

## మోదీ పొలిటికల్ గేమ్

**న్యూఢిల్లీ**

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశంపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సుదీర్ఘ కాలం మౌనంగా ఉండి, ఇప్పుడు అకస్మాత్తుగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయడం వెనుక కేవలం ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలనే కుతంత్రం దాగి ఉందని మండిపడ్డారు. శుక్రవారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం (సీడబ్ల్యూసీ)లో ఆయన ప్రారంకోపన్యాసం చేశారు. కేంద్రం వైఖరిని ఎండగట్టారు. సమావేశంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జ్ కేసీ వేణుగోపాల్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుక్కు, కీలక నేతలు ప్రియాంకా గాంధీ, జైరాం రమేష్, సల్మాన్ ఖుర్షీద్, అంబికా సోనీ, సచిన్ పైలట్, భూపేశ్ బఘేల్ పాల్గొన్నారు.

**అమలు లేని రిజర్వేషన్ ఎందుకు?...**

'ఏప్రిల్ 16 నుంచి 18వ తేదీ వరకు పార్లమెంట్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. కానీ ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి అధికారిక ప్రతిపాదన రాలేదు. ప్రధాని రాసే వ్యాసాలు చదివి కొన్ని విషయాలు తెలుసుకోవాల్సి వస్తోంది. మాకు అందిన సమాచారం ప్రకారం.. ఈ రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. కేవలం ఈ ఎన్నికల్లో లబ్ధి కోసమే ఈ బిల్లును తెస్తున్నారు'అని ఖర్గే విమర్శించారు.

**డీలిమిటేషన్ వెనుక కుట్ర...**

లోక్‌సభ సీట్లను 543 నుంచి 816కు పెంచాలన్న ప్రతిపాదనపై ఖర్గే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు సంబంధించి ప్రభుత్వం ముందుకు తెచ్చిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ తీవ్ర విపరిణామాలకు దారితీస్తుందని హెచ్చరించారు. 'డీ లిమిటేషన్ ప్రతిపాదన అత్యంత ప్రమాదకరమైంది. దీనిపై లోతైన చర్చ జరగాలి. బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో ఎంపీలు బిజీగా ఉన్న సమయంలో సమావేశాలు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవడం నిబంధనల ఉల్లంఘనే. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించడం లేదు. అది హోంశాఖ కింద పనిచేసే ఒక విభాగంలా మారిపోయింది. అందుకే ఈ కోడ్ ఉల్లంఘనలను వారు పట్టించుకుంటారని మేం ఆశించడం లేదు'అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

**హైదరాబాద్ సీడబ్ల్యూసీలో తీర్మానం చేశాం**

మహిళా సాధికారత విషయంలో తమకు ఎవరి సరి?టఫికెట్లు అవసరం లేదని ఖర్గే స్పష్టం చేశారు. 'స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చొరవతో తెచ్చిన 73, 74 రాజ్యాంగ సవరణల వల్లే నేడు స్థానిక సంస్థల్లో 14.5 లక్షల మంది మహిళలు ప్రతినిధులుగా ఉన్నారు. 2023లోనే ఈ బిల్లుపై మేం హైదరాబాద్ సీడబ్ల్యూసీలో తీర్మానం చేశాం. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అనేకసార్లు ప్రధానికి లేఖలు రాశారు. జనగణన, డీ లిమిటేషన్ పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే రిజర్వేషన్లు అమలు చేయాలి'అని డిమాండ్ చేశారు. పశ్చిమ ఆసియా సంక్షోభం వల్ల తలెత్తిన ఆర్థిక ఒత్తిడిపై విపక్షాలతో కలిసి ఉమ్మడి వ్యూహంతో ముందుకు వెళ్తాం'అని ఖర్గే వెల్లడించారు.

**వచ్చే వారం ప్రతిపక్ష నేతలతో ఖర్గే భేటీ**

ప్రభుత్వం తలపెట్టిన పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహంపై చర్చించేందుకు ప్రతిపక్ష నేతలతో సమావేశం జరపనున్నట్లు కాంగ్రెస్ శుక్రవారం తెలిపింది. మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి కాకుండా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ అంశాన్ని ఈ సమావేశాల్లో చర్చించనున్నట్లు ప్రభుత్వం చెబుతోందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ చెప్పారు. అయితే, ఇందుకు సమాచారాన్ని ప్రభుత్వం ఇంతవరకు ప్రతిపక్షాలకు అందజేయలేదని ఆరోపించారు. ఈ నెల 15వ తేదీన కాంగ్రెస్ చీఫ్ ఖర్గేఅధ్యక్షతన ప్రతిపక్ష పార్టీల నేతలతో సమావేశం జరుగుతుందన్నారు.

## జస్టిస్ వర్మ రాజీనామా

**న్యూఢిల్లీ/అలహాబాద్**

అభిశంసన ప్రక్రియను ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ(57) తన పదవికి రాజీనామా చేశారు. గత సంవత్సరం ఢిల్లీలోని నివాసంలో ఆయన నోట్ల కట్టలతో దొరికిపోయిన సంగతి తెలిసిందే. పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలున్న జస్టిస్ వర్మను పదవి నుంచి తొలగించడానికి పార్లమెంట్‌లో అభిశంసన ప్రక్రియను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో హఠాత్తుగా రాజీనామా చేయడం సంచలనాత్మకంగా మారింది. గురువారం తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపించారు. 'తీవ్రమైన ఆవేదన'తో తక్షణమే రాజీనామా చేస్తున్నానని, ఇన్నాళ్లూ న్యాయమూర్తిగా సేవలందించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని లేఖలో పేర్కొన్నారు. న్యాయమూర్తి పదవికి జస్టిస్ వర్మ రాజీనామా సమరి?పంచడంతో ఆయనపై లోక్‌సభ ప్రారంభించిన అభిశంసన చర్యలు నిష్ఫలమైనట్లేనని అధికారులు శుక్రవారం తెలిపారు. వాస్తవానికి ఆయన పదవీ కాలం 2031 జనవరి 5 దాకా ఉంది. పార్లమెంట్ తనపై వేటు వేసేదాకా ఆగకుండా ముందుగానే పదవి నుంచి తప్పుకున్నారు. లోక్‌సభ నియమించిన కమిటీ నేతృత్వంలో జరుగుతున్న విచారణ ప్రక్రియ నుంచి సైతం వైదొలిగినట్లేనని చెబుతున్నారు.

**రెండుసార్లు ఎదురుదెబ్బ**

జస్టిస్ వర్మ గత ఏడాది ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. 2025 మార్చి 14న రాత్రి 11.35 గంటల సమయంలో ఆయన అధికారిక నివాసంలో అగ్ని?నప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. జస్టిస్ వర్మ ఇంట్లో మంటలు ఆర్పుతుండగా ఒక గదిలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు లభించాయి. కొన్ని కాలిపోయిన స్థితిలో కనిపించాయి. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు హైకోర్టు అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ ఉదంతంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. వివరణ ఇవ్వాలని జస్టిస్ వర్మను సీజేఐ ఆదేశించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. తనపై వచ్చిన ఆరోపణలను ఆయన ఖండించారు. నోట్ల కట్టలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. సుప్రీంకోర్టు ఆయనను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది. న్యాయపరమైన విధులు అతడికి అప్పగించవద్దని ఆదేశించింది. జస్టిస్ వర్మ తప్పుచేసినట్లుగా సుప్రీంకోర్టు నియమించిన అంతర్గత దర్యాప్తు కమిటీ తేల్చింది. పదవి నుంచి తొలగించాలని సిఫార్సు చేసింది. కానీ, పదవి నుంచి తప్పుకోవడానికి నిరాకరించారు. రాజీనామా చేసే ప్రసక్తే లేదన్నారు. దాంతో అతడిపై అభిశంసన చర్యలు ప్రారంభించాలంటూ ప్రభుత్వానికి సీజేఐ విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు అంతర్గత దర్యాప్తు కమిటీ నివేదికను కొట్టివేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన జస్టిస్ వర్మకు ఎదురుదెబ్బ తగిలింది. అతడి పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. అభిశంసన చర్యలు ప్రారంభిస్తూ గత ఏడాది ఆగస్టు 12న లోక్‌సభలో ఒక తీర్మానం ఆమోదించారు.

అవినీతి ఆరోపణలపై దర్యాప్తు కోసం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ముగ్గురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏర్పాటును సవాలు చేస్తూ జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఏడాది జనవరి 16న పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. పార్లమెంటరీ కార్యకలాపాలకు ఆటంకం కలిగించడానికి చట్టంలోని నిబంధనను ఆయుధంగా ఉపయోగించరాదని తేల్చిచెప్పింది. దాంతో అభిశంసనకు అడ్డంకులు తొలగిపోయాయి. ఘోర పరాభవం తప్పదని తేలడంతో జస్టిస్ వర్మ రాజీనామా చేశారు. తనపై నిందలు వేస్తూ జరుగుతున్న ప్రచారానికి బాధితుడిగా మారానని పేర్కొంటూ జస్టిస్ వర్మ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నియమించిన విచారణ కమిటీకి లేఖ రాశారు. అందులో తన ఆవేదనను వ్యక్తం చేశారు.

## సంపాదకీయం

# ఏకధ్రువ ప్రపంచానికి చెక్ పెట్టినట్లేనా!

ప్రతిమనిషి పుట్టుకతోనే జీవించే హక్కుతో భూమిమీదకు వస్తాడు. మరణం అనేది ఆ హక్కుకు దూరం కావడమే! సాధారణ మరణం సహజ ప్రక్రియ. యుద్ధ మరణం అనేది ఉన్మాద చర్యతో జీవించే హక్కును అర్థాంతరంగా తుంచివేయడం. అందుకే ఏరకమైన యుద్ధమైనా వినాశ హేతువే? యుద్ధం ఒక పీడకచర్య. యుద్ధ మరణాలకు హేతుబద్దత ఉండదు. మధ్యయుగాలలో యుద్ధమంటే వీరత్వానికి ప్రతీక. అటు తర్వాత ఆయుధం ప్రధానపాత్ర వహించింది. అధికారానికి ఆయుధం ప్రాకారంగా నిలిచింది. సాంకేతికత అభివృద్ధి చెందిన ఈ దశలో ఆయుధానిదే పైచేయి అయింది. ఇప్పుడు యుద్ధ వ్యూహాల్లో మార్పులొచ్చాయి. ఒకప్పుడు రష్యా, అమెరికా ప్రచ్ఛన్న యుద్ధస్థితి నుంచి, రష్యా అంతర్గత రాజకీయ మార్పుల తర్వాత అమెరికా ఏకధృవ ప్రపంచంగా ఎదిగింది. అంతేకాదు, తమ భూభాగంలో కాకుండా ప్రపంచం మొత్తం యుద్ధ స్థావరాలు ఏర్పరచుకొని, సైన్యాన్ని మోహరించి ప్రపంచ పోలీసుగా పెత్తనం చేస్తోంది. జనరల్ గడాఫీ, అలెండీ, సద్దాం హుస్సేన్ లాంటి ఎందరో దేశాధినేతలను హత్య చేయడంతో పాటు, ఆసియా, అమెరికా, ఆఫ్రికా ఖండాల్లో అనేక దేశాలతో యుద్ధాలు చేసింది. చివరకు తమ వ్యాపార సామ్రాజ్యానికి పోటీరాకుండా జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అణుబాంబులు వేసి సాముహిక మానవహననానికి అమెరికా పాల్పడింది. వియత్నాంతో పదహారేళ్ల సుదీర్ఘ యుద్ధం తర్వాత అమెరికా దూకుడుకు కళ్లెం పడింది. ఇప్పుడు ఇరాన్‌తో భూతల యుద్ధంతో తలపడడం అంటే చావునోట్లో తలపెట్టడమేనన్న వ్యవహారం అర్థమైన తర్వాత ఇంటా, బయట ఏకాకిగా మారిన ట్రంప్, వ్యూహం మార్చి ఇరాన్‌తో సీజ్ ఫైర్‌కు తాపత్రయ పడ్డాడు. వ్యూహాత్మకంగా ఊపిరి పీల్చుకోవడానికి ఇరాన్ కూడా పది షరతులతో సిద్ధమైంది. సీజ్‌ఫైర్ అనబడే ఒప్పందం అనేది ఇటీవల కాలంలో ముందుకొచ్చిన దౌత్య ప్రక్రియనే. ఒకప్పుడు గ్రూపుల మధ్య ఒప్పందం ఇప్పుడు దేశాల మధ్యకు మారింది. భారత్–పాకిస్తాన్, ఇరాన్–ఇజ్రాయిల్ యుద్ధాలలో ట్రంప్ ముందుకు తెచ్చిన ప్రక్రియనే ఇది. కొత్తదేం కాదు, కాకుంటే ఓటమి అంచుల్లో పరువు దక్కించుకునే ఏకైక సూచిక! ట్రంప్ రెండువారాల యుద్ధ వెసులుబాటుకు ప్రయత్నమే ఆయనలో నెలకొన్న ఓటమి భయానికి నిదర్శనం. ఇరాన్‌లో 240మంది మహిళలు, 212 మంది పిల్లలు వెరసి 2076 మంది ప్రజలు యుద్ధంలో మరణించారు, 26,500 ప్రజలు గాయపడ్డారు. మిత్రదేశం లెబనాన్‌లో మరో 13వందల మంది ప్రజలను ఇజ్రాయిల్ చంపేసింది. అంతేకాదు, యుద్ధ ప్రారంభంలోనే ఇజ్రాయిల్, అమెరికా కుట్రపూరితంగా ఇరాన్ సుప్రీం లీడర్ అయుతుల్లా ఖొమైనీని అంతం చేసింది. అయినా ఇరాన్ తమ మౌలిక వనరుల రక్షణ దృష్టితో సీజ్‌ఫైర్‌కు అంగీకరించింది. సుదీర్ఘ కాలం తమవెంట ఉన్న పశ్చిమ యూరప్ దేశాల యుద్ధ కూటమి "నార్త్ అట్లాంటిక్ ట్రిటీ ఆర్గనైజేషన్' నాటోలోని 30 దేశాలు ఇరాన్‌పై ట్రంప్ దాడికి మద్దతివ్వలేదు. సరికదా కొన్ని దేశాలు నేరుగా ఇరాన్‌కు మద్దతు తెలిపాయి. ఇక ప్రపంచ దేశాల ప్రజలతో పాటు, తనదేశంలో ప్రజలు నిరసన పతాకస్థాయికి చేరడంతో ట్రంప్ ఓ అడుగు సీజ్‌ఫైర్ పేరుతో వెనక్కి తగ్గాడు తప్ప, తనలోని యుద్ధ పిపాసి ఇంకా చావలేదు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత పిచ్చోడి చేతిలో రాయిలా ప్రపంచ దేశాలపై టారిఫ్‌ల పేరుతో విరుచుకుపడ్డాడు. గాజా విషయంలో ఇజ్రాయిల్ అమానుష కాండకు పరోక్షంగా మద్దతిచ్చాడు. పనామా అధ్యక్షుడు నోరిగోను మాదకద్రవ్యాల పేరుతో జైలు శిక్ష వేసి నిర్బందించాడు."ఆపరేషన్ అబ్జర్వేట్ రిజర్వ్" పేరుతో ప్రజలచేత ఎన్నికైన వెనెజులా అధ్యక్షుడు మదురో, ఆయన భార్య సిలియాలను అర్ధరాత్రి ఇంటినుంచి కిడ్నాప్ చేసి అమెరికా జైలులో నిర్బంధించాడు.కేవలం ఆయిల్‌పై నియంత్రణ కోసం ఒకదేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకం చేయడమే కాక, తన పదవీ కాలం ముగిసిన తర్వాత వెనెజులాలో ఎన్నికలని కుళ్లు జోకులు వేస్తున్నాడు. పక్క రాష్ట్రం మెక్సికోతో ఘర్షణ, చిన్నదీవి లాంటి దేశం క్యూబాపై మానవత్వం మరచి ఆంక్షలు పెట్టడంతో పాటు, ఇరాన్ యుద్ధం తర్వాత క్యూబా అంతు చూస్తానంటున్నాడు. మరోవైపు పక్క దేశం కెనడాను తమదేశంలో అంతర్భాగం రాష్ట్రంగా కలుపుకుంటామని అవాకులు చవాకులు పలుకుతున్నాడు. నాటోలో అంతర్భాగమైన డెన్మార్క్‌కు చెందిన గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించి నాటో కూటమి దేశాల్లో తమ పరపతి కోల్పోయాడు. ఆఫ్ఘనిస్తాన్‌లోని కాందహార్ విమానాశ్రయం కావాలని పట్టుబడుతున్నాడు. ఇవన్నీ ట్రంప్ ఆయా దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించకుండా వేస్తున్న చిల్లర వేషాలు తప్ప మరొకటి కాదు. మరో ముఖ్యమైన విషయం. ఎప్‌స్టీన్ ఫైల్స్ నుండి బయటపడడం కోసం, అత్యంత పెద్దదైన ఆసియా ఖండంలో పట్టుకోసం మరో యుద్ధోన్మాద దేశం ఇజ్రాయిల్‌తో కలిసి కుట్రపన్నాడు! ఇరాన్‌ను ఓడిస్తే తనకు ప్రపంచంలో తిరుగుండదని, యుద్ధ ప్రారంభంలోనే ఖొమైనీ లాంటి ఆయువుపట్టును లేపేస్తే, తాను వెనెజులా దేశంలా ఇరాన్‌ను కబళించి ఆధిపత్యం చెలాయించాలని చేసిన ప్రయోగం బెడిసికొట్టింది. నలభై రోజులుగా యుద్ధంలో ఇరాన్ అటు ఇజ్రాయిల్‌తో పోరాడుతూనే, అమెరికా అవకాశ ఆధిపత్యాన్ని వ్యూహాన్ని సవాల్ చేసి నిలబడింది. ఇరానియన్ రిపబ్లిక్ గార్డుల ధైర్య సాహసాలముందు అమెరికా తలవంచక తప్పలేదు. అగ్రరాజ్య ఆధునిక యుద్ధ విమానాలను కూల్చివేయడంతో ట్రంప్ దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. అంతర్గత సంక్షోభం, అధికార మార్పిడి లాంటి మాటలు ఇరాన్‌లో తుత్తునీయలు కావడం, ప్రపంచ పాలక వర్గాలు ఎలావున్నా ప్రజలు మద్దతు ఇరాన్‌కు అను కూలంగా ఉండడం, ఇరాన్ కూడా భౌగోళిక యుద్ధ తంత్రం హార్మూజ్ జలసంధి మూసివేత, గల్ఫ్‌లో ఉన్న సౌదీ అరేబియా తదితర దేశాల్లో అమెరికా సైనిక శిబిరాలు, ఆయా దేశాల సాంకేతిక, ఆర్థిక వనరులపై వ్యూహాత్మకంగా దాడులు జరపడం ద్వారా అమెరికాకు వణుకు పుట్టించిందని చెప్పవచ్చు. ఇజ్రాయిల్ కోసం అమెరికా ఇరాన్‌పై దండయాత్రకు దిగింది. తమకు అమెరికా ప్రజలతో ఎలాంటి శత్రుత్వం లేదని ఇరాన్ ప్రకటించడం ఆ దేశ కుయుక్తిని ఎండగట్టింది. అమెరికా ఇరాన్ యుద్ధంలో ఒంటరై ఏకధృవ ప్రపంచం ఏవగింపునకు గురైంది. ఈ దశలో సీజ్‌ఫైర్ రెండు వారాల తర్వాత శాశ్వత ఒప్పందం జరుగుతుందా? యూటర్న్ తీసుకుంటుందా? ఈ విషయం నిర్ధారించే పరిస్థితి లేదు. ఎందుకంటే ఒప్పందం జరిగింది అమెరికా–ఇరాన్ మధ్య కనుక తాము యుద్ధం ఆపేది లేదని ఇజ్రాయిల్ తన యుద్ధ దాహం తీరక లెబనాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తోంది. అందుకు ప్రతిగా ఇరాన్ సైతం గల్ఫ్‌లో ఇజ్రాయిల్, అమెరికా అనుకూల దేశాలపై దాడులు చేస్తోంది. అమెరికా–ఇరాన్ యుద్ధం ద్వారా రష్యా ఒకింత ఆయిల్ వ్యాపార రిత్యా, ఉక్రెయిన్ వైపు అమెరికా ఆయుధ సంపత్తి అందకుండా చేయడంలో సఫలమైంది. చైనా, ఉత్తరకొరియా, రష్యా దేశాలు ఇరాన్‌కు అందించిన సాంకేతిక, ఆయుధ మద్దతు ఆ దేశం నిలబడడానికి చాలా తోడ్పాటునందించింది. హార్మూజ్ జలసంధి విషయంలో చైనా, రష్యా, ఫ్రాన్స్ ఐక్యరాజ్యసమితిలో తమ వీటో అధికారంతో ఇరాన్‌కు మద్దతు పలకడం అమెరికా ఏకఛత్రాధిపత్యానికి ఒక రకంగా చెక్ పెట్టినట్లే!

# సామాజిక న్యాయం ప్రపంచ శాంతికి వారధి


మానవ నాగరికత పరిణామ క్రమంలో పారిశ్రామిక విప్లవం ఒక మైలురాయి. అయితే, యంత్రాల హోరులో మనిషి శ్రమ దోపిడీకి గురవ్వడం, అమానవీయ పరిస్థితుల్లో కార్మికులు మగ్గిపోవడం ఆ విప్లవం తెచ్చిన మరో చీకటి కోణం. ఈ నేపథ్యంలో, "సామాజిక న్యాయం లేకుండా శాశ్వత ప్రపంచ శాంతి సాధ్యం కాదు" అనే గొప్ప ఆశయంతో ఉద్భవించిన అరుదైన వ్యవస్థ 'అంతర్జాతీయ కార్మిక సంస్థ'. ప్రపంచ చరిత్రలో కార్మిక హక్కుల పరిరక్షణకు ఒక దిక్సూచిలా నిలిచిన ఈ సంస్థ, గత శతాబ్ద కాలంగా శ్రామిక లోకానికి రక్షణ కవచంగా నిలుస్తోంది. 19వ శతాబ్దపు చివరలో, 20వ శతాబ్దపు ప్రారంభంలో ఐరోపా, అమెరికా ఖండాల్లో పారిశ్రామికీకరణ వేగంగా విస్తరించింది. కానీ, కార్మికులకు కనీస వేతనాలు లేవు, పని గంటలకు పరిమితి లేదు, ప్రాణాలకు రక్షణ లేని ప్రమాదకర వాతావరణం నెలకొంది. ఈ దోపిడీపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ దేశాలు శాంతి స్థాపన కోసం చర్చలు జరుపుతున్న తరుణంలో, కార్మిక సమస్యల పరిష్కారం కూడా ప్రపంచ శాంతిలో అంతర్భాగమేనని గుర్తించారు. ఈ క్రమంలోనే 1919లో జరిగిన 'వెర్సైల్లెస్ శాంతి ఒప్పందం' ద్వారా ఐ.ఎల్.ఓ ఆవిర్భవించింది. మొదట ఇది 'లీగ్ ఆఫ్ నేషన్స్'కు అనుబంధంగా పనిచేసినప్పటికీ, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 1946లో ఐక్యరాజ్య సమితిలో చేరిన మొట్టమొదటి ప్రత్యేక అనుబంధ సంస్థగా గుర్తింపు పొందింది. దీని ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉంది. ఐ.ఎల్.ఓ యొక్క అత్యంత విశిష్టమైన లక్షణం దాని 'త్రైపాక్షిక నిర్మాణం'. ప్రపంచంలోని మరే ఇతర అంతర్జాతీయ సంస్థలోనూ ఇటువంటి ప్రజాస్వామ్య వ్యవస్థ కనిపించదు. ఇందులో ప్రభుత్వ ప్రతినిధులతో పాటు, యజమానుల సంఘాల ప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులు సమాన స్థాయిలో కూర్చుని నిర్ణయాలు తీసుకుంటారు. ఈ నిర్మాణం వల్ల ఏ చట్టం లేదా ప్రమాణం రూపొందించినా, అది క్షేత్రస్థాయిలో అమలు కావడానికి అవసరమైన సమతుల్యత దొరుకుతుంది. ఈ సంస్థ మూడు ప్రధాన విభాగాలుగా పనిచేస్తుంది. 'అంతర్జాతీయ కార్మిక సదస్సు' ఏటా ప్రమాణాలను నిర్ణయిస్తే, 'పాలక మండలి' కార్యనిర్వాహక బాధ్యతలు చేపడుతుంది. 'అంతర్జాతీయ కార్మిక కార్యాలయం' సచివాలయంగా సేవలందిస్తుంది. ఐ.ఎల్.ఓ లక్ష్యాల గురించి మాట్లాడుకుంటే, 1944లో ఆమోదించిన 'ఫిలడెల్ఫియా ప్రకటన' అత్యంత కీలకమైనది. "పేదరికం ఎక్కడున్నా అది ప్రపంచ సంపదకు ముప్పు" అని ఈ ప్రకటన ఘోషించింది. శ్రమ అనేది విక్రయ వస్తువు కాదని, భావప్రకటన స్వేచ్ఛ మరియు సంఘటితమయ్యే హక్కు పురోగతికి మూలమని ఇది చాటిచెప్పింది. ఈ స్ఫూర్తితోనే ఐ.ఎల్.ఓ ఇప్పటివరకు 190కి పైగా ఒప్పందాలను, 200కి పైగా సిఫార్సులను రూపొందించింది. వీటిలో ఎనిమిది ఒప్పందాలను 'కోర్ కన్వెన్షన్స్'గా పరిగణిస్తారు. బలవంతపు చాకిరీ నిర్మూలన, సంఘటిత హక్కు, సమాన వేతనం, వివక్ష రూపుమాపడం, మరియు బాల కార్మిక వ్యవస్థ అంతం చేయడం వంటివి ఇందులో భాగాలు. ముఖ్యంగా 1919లోనే 8 గంటల పని దినం,



వారానికి 48 గంటల పని సమయాన్ని ప్రతిపాదించడం అప్పట్లో ఒక విప్లవాత్మక మార్పు. ప్రస్తుతం 187 సభ్యదేశాలతో విస్తరించిన ఈ సంస్థ, 1969లో తన 50వ వార్షికోత్సవం సందర్భంగా 'నోబెల్ శాంతి బహుమతి'ని గెలుచుకుంది. ఇది కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం కాకుండా, మానవ గౌరవం కోసం చేస్తున్న కృషికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపు. 1999లో జువాన్ సోమావియా డైరెక్టర్ జనరల్‌గా ఉన్న సమయంలో 'డీసెంట్ వర్క్'(గౌరవప్రదమైన ఉపాధి) అనే సరికొత్త నినాదాన్ని ఐ.ఎల్.ఓ తెరపైకి తెచ్చింది. కేవలం పని దొరకడం ముఖ్యం కాదు, అది మనిషి ఆత్మగౌరవాన్ని కాపాడేలా, సామాజిక భద్రతతో కూడినదిగా ఉండాలని ఇది స్పష్టం చేస్తోంది. భారతదేశ దృక్పథంలో చూస్తే, మన దేశం ఐ.ఎల్.ఓ స్థాపక సభ్య దేశాలలో ఒకటి. మన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు, కార్మిక చట్టాలపై ఐ.ఎల్.ఓ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. 1923 నాటి కార్మికుల నష్టపరిహార చట్టం నుండి నేటి 'లేబర్ కోడ్స్' వరకు అన్నీ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగానే రూపుదిద్దు కున్నాయి. అయితే, గణాంకాలు నేటికీ సవాలు విసురుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 200 కోట్ల మంది అసంఘటిత రంగంలోనే ఉన్నారని, వీరికి ఎటువంటి పెన్షన్ లేదా ఇన్సూరెన్స్ వంటి సామాజిక భద్రత లేదని ఐ.ఎల్.ఓ హెచ్చరిస్తోంది. అలాగే 16 కోట్ల మంది బాల కార్మికులు ఉండటం మానవాళికి మాయని మచ్చగా మిగిలింది. నేడు ప్రపంచం నాలుగో పారిశ్రామిక విప్లవంలో ఉంది. కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటి సాంకేతికతలు ఉద్యోగాల స్వరూపాన్ని మార్చేస్తున్నాయి. 'గిగ్ ఎకానమీ' పేరుతో కొత్త రకం ఉపాధి మార్గాలు వస్తున్నాయి. ఇక్కడ కార్మికులకు, యజమానులకు మధ్య స్పష్టమైన నిర్వచనం లేకపోవడం వల్ల హక్కుల పరిరక్షణ క్లిష్టంగా మారింది. వలస కార్మికుల సమస్యలు, వాతావరణ మార్పుల వల్ల ఉపాధి కోల్పోతున్న వారి పరిస్థితి ఐ.ఎల్.ఓ ముందున్న ప్రస్తుత సవాళ్లు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని 'ఫ్యూచర్ ఆఫ్ వర్క్' పేరుతో ఐ.ఎల్.ఓ కొత్త కార్యాచరణను సిద్ధం చేస్తోంది. డిజిటల్ యుగంలో కూడా మానవీయ విలువలు మరుగవ్వకుండా చూడటమే ఈ సంస్థ తదుపరి లక్ష్యం. గత వంద ఏళ్లలో ఐ.ఎల్.ఓ సాధించిన విజయాలు అపారం. బానిసత్వం లాంటి పని పరిస్థితుల నుండి కార్మికులను విముక్తి చేయడంలో, మహిళలకు ప్రసూతి సెలవుల వంటి హక్కులు కల్పించడంలో, కనీస వేతన చట్టాలను అమలు చేయడంలో ఈ సంస్థ పాత్ర చిరస్మరణీయం. అయినప్పటికీ, ఇంకా పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, నిరుద్యోగితా రేటును చూస్తే ఐ.ఎల్.ఓ ప్రయాణం ముగియలేదని అర్థమవుతుంది. ప్రతి మనిషికి గౌరవప్రదమైన పని, ప్రతి కార్మికుడికి సామాజిక న్యాయం దక్కిన రోజే ఐ.ఎల్.ఓ ఆశయం పరిపూర్ణమవుతుంది. శ్రామిక శక్తే ప్రపంచ సంపదకు మూలమని నమ్మి, ఆ శ్రమను గౌరవించే సమాజం కోసం ఈ అంతర్జాతీయ సంస్థ నిరంతరం కృషి చేస్తూనే ఉంటుంది.

# జన్యులోపమే పార్కిన్సన్‌కు మూలం

18వ శతాబ్దంలో జేమ్స్ పార్కిన్ సన్ అనే ఆంగ్లవైద్యుడు ఒళు ్ళ ఒణుకు వ్యాధి అనే పేరుతో మొదట దీన్ని నిర్వచించిన కారణంగా పార్కిన్సన్స్ వ్యాధి అంటారు. ఈ వ్యాధి వేదకాలంలోనే ప్రస్తావించబడింది. ఆయుర్వేద సంహితలో అంటే ప్రాచీన భారతీయ వైద్యశాస్త్రంలో ఈ వ్యాధి, దాని లక్షణాలు, చికిత్స పేర్కొన బడ్డాయి. నాటి వైద్యశాస్త్ర నిపుణులు దీన్ని కంపవాత మన్నారు. 2500 సంవత్సరాలకు పూర్వమే నైజింగ్ అనే చైనా వైద్యశాస్త్రంలో దీని గురించిన ప్రస్తావన వుంది. కంపవాతం ఆయుర్వేద రీత్యా ఒక నరాల జబ్బు. ఈ వ్యాధి సోకిన మనిషి కదలికలో వ్యత్యాసం కనిపిస్తుంది. కూర్చొని, పడుకొని ఉన్నంతసేపూ బాగుంటాడు. కాని లేచి నిలబడి కదలబోతే శరీరం వణికి ఇటూ అటూ కదిలిపోతూ పడిపోతుంటాడు. పార్కిన్సన్ వ్యాధిని ఇప్పటికీ కారణం తెలియని వ్యాధిగానే పరిగణిస్తు న్నారు. జన్యుపరంగా, పర్యావరణ కారణాలవల్ల ఈ వ్యాధి వస్తుంది. పర్యావరణ కాలుష్యం విషపదార్థాలు, ఎరువులు, డ్రగ్స్ (యాంటీ సైకోటికో, వాంతి వచ్చే మందులు) తయారీ, తరచుగా తలనొప్పి తదితర కారణాలతో పార్కిన్సన్ వ్యాధి ముడిపడి ఉంది. మెదడులో ఉత్పన్నమయ్యే డోపమైన్ కణాలు తగ్గిన పక్షంలో ఈ వ్యాధి వచ్చినట్టు నిర్ధారణ చేసుకోవచ్చు. ప్రొటీనోపతి (ప్రోటీన్లకు సంబంధించిన రుగ్మత) వల్ల పార్కిన్సన్ వ్యాధివచ్చే అవకాశముంది. పార్కిన్సన్ వ్యాధి సర్వసాధారణ వ్యాధి. ఇది సమాజంలో ప్రబలంగా ఉంది. 60 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు ఇది వస్తుంది. దీన్ని వృద్ధాప్యంలో వచ్చే అంగవైకల్య వ్యాధిగా పరిగణిస్తారు. "వణుకుడు రోగం" లేక "పార్కిన్సన్స్ వ్యాధి" నాడీ కణాలను (నరాల కణాలను) దెబ్బ తీయడం ద్వారా ప్రగతిశీల మెదడు దెబ్బకు దారితీస్తుంది. 'డోపమైన్' అని పలవబడే న్యూరోట్రాన్స్మిటర్ ద్వారా మెదడు అంతటా సంకేతాలు ప్రసరించే బాధ్యత ఈ నాడీ కణాలదే. సాధారణ పరిస్థితులలో, మృదువైన, సమతుల్య కండరాల సమన్వయాన్ని డోపమైన్ సహాయంతో సాధించవచ్చు. ఈ డోపామైన్ అనే ఈ న్యూరోట్రాన్స్మిటర్ లేకపోవడం మూలంగానే "పార్కిన్సన్స్ వ్యాధి" లేక వణుకుడు రోగం మనుషుల్లో సంభవిస్తుంది. పార్కిన్సన్స్ వ్యాధి యొక్క ప్రారంభ



మరియు అత్యంత సాధారణ లక్షణాలు శరీరంలోని అవయవాల్లోని ఎదో ఒక భాగంలో... చేతులు లేదా కాళ్ళు లేదా దవడ లోనైనా, వణుకుడు రావడం. చేయి విశ్రాంతి దశలో ఉన్నప్పుడు ప్రకంపన లేదా వణుకు సాధారణంగా గుర్తించ బడుతుంది, సాధారణంగా చూపుడు వేలుకు వ్యతిరేకంగా బొటనవేలు యొక్క కదలికను చూడవచ్చు. దీని రెండవ లక్షణం సాధారణంగా కండరాల పెడసరం లేదా కండరాలు బిగదీయడం. మనిషి స్వేచ్ఛా చలన వలయాల్ని కుంటుపరుస్తూ (పరిమితం చేస్తూ) అనియంత్రితమైన కండరాల పెడసరం లేక కండరాలు పట్టేయడ మనేది వణుకుడు వ్యాధి లక్షణం. వ్యాధికి గురైన వ్యక్తులు చేపట్టిన ఏదైనా పనియొక్క వేగంలో క్రమమైన తగ్గుదలను చూపుతారు. స్నానం లేదా తినడం వంటి సాధారణ కార్యకలాపాల్ని పూర్తి చేయడంలో కూడా వీళ్ళు అసాధారణంగా ఎక్కువసేపు తీసుకోవాల్సి వస్తుంది.సాపేక్షంగా అరుదుగా ఉండే లక్షణాలలో భయము, చొంగ కార్చడం, చర్మ సమస్యలు, మూత్ర సమస్యలు, లైంగిక అసమర్థత ఉంటాయి. వ్యాధి బాధితుడి వణుకుడు గణనీయంగా సదరు వ్యక్తి మాటల్ని మరియు చేతివ్రాతను దెబ్బ తీస్తుంది. వణుకుడు రోగానికి సంభావ్య కారణాలను గుర్తించడానికి పరిశోధన కొనసాగుతున్నప్పటికీ, అదిప్పటికీ తెలియదు. జన్యు కారకాలు మరియు కొన్ని పర్యావరణ పరిస్థితుల్ని వణుకుడు జబ్బుకు ప్రమాద కారకాలుగా భావిస్తారు. పార్కిన్సన్స్ వ్యాధిని అభివృద్ధి చేయడంలో జన్యు పరివర్తనలు ప్రమాద కారకంగా గుర్తించబడ్డాయి, యాంటిసైకోటిక్ ఔషధాలను సేవించే వ్యక్తులు లేదా మెదడు అనారోగ్యంతో బాధపడుతున్న వారిలో లేదా గతంలో స్ట్రోక్ లకు గురై బాధపడుతున్న వ్యక్తులకు వణుకుడు రోగం సంభవించ వచ్చునని భావించ బడుతోంది. పరిస్థితిని నిర్ధారించడానికి నిర్దిష్ట రక్తం లేదా ప్రయోగశాల పరిశోధన లేనందున పార్కిన్సన్స్ వ్యాధి నిర్ధారణను గందరగోళంగా చెప్పవచ్చు. అంతే కాకుండా, లక్షణాలు తరచూ కీళ్ళ అసాధారణతలు లేదా విటమిన్ లోపాల వంటి ఇతర రుగ్మతలను అనుకరిస్తాయి. ఒక అర్హత కలిగిన న్యూరాలజిస్ట్ తో సలహా, సంప్రదింపులు తీసుకోవాలి. ఈ న్యూరాలజిస్ట్ కొంతకాలం పాటు లక్షణాలను పరిశీలించి, వ్యాధి పురోగతిని ఆపడమే లేక నియంత్రించడమో చేయగలరు. చికిత్సకు సంబంధించినంత వరకు, 'డోపమైన్' లోప పరిస్థితికి వివిధ రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఈ మందులు వ్యాధికి గురైన మెదడు బాగాలను ప్రేరేపించడం ద్వారా పని చేస్తాయి. అయితే, దీర్ఘకాలిక దశలో, ఈ మందులు దుష్ప్రభావాలను చూపుతాయి. మందులు వ్యాధి లక్షణాలను నియంత్రించ లేకుంటే, శస్త్రచికిత్స అవసరం కావచ్చు. మెదడును ప్రేరేపించటానికి ఎలక్ట్రోడ్లు ఉపయోగించడం ఇందులో జరుగుతుంది, ఇలా చేయడం ద్వారా వణుకుడ్ని ప్రేరేపించడానికి దారితీసే ప్రేరణల్ని అడ్డుకోవడం జరుగుతుంది. పార్కిన్సన్స్ వ్యాధి ఒక ప్రగతిశీల రుగ్మత. ఈ రుగ్మతకు ఖచ్చితమైన నివారణ లేదు. మానసిక ఆరోగ్యాన్ని, శారీరక చర్యల్ని చేపట్టే సామర్థ్యాన్ని కాపాడు కోవడమే ఈ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తుల దీర్ఘకాలిక లక్ష్యాలుగా ఉండాలి.

# పుచ్చకాయ తింటూ గింజలు మింగేశారా?



వేసవిలో అధికంగా లభించే పుచ్చకాయలు రుచిగా ఉండటమేకాకుండా వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా ఎన్నో విధాలుగా సహాయపడుతుంది. ఆరోగ్యంగా ఉండటానికి పుచ్చకాయ తినడం తప్పనిసరి. తీవ్రమైన వేడిలో శరీరాన్ని తాజాగా ఉంచడానికి పుచ్చకాయ కంటే మంచిన మరో ప్రత్యామ్నాయం లేదంటే అతిశయోక్తి కాదు. వేసవిలో పుచ్చకాయలు పుష్కలంగా లభిస్తాయి. ఇవి రుచిగా ఉండటమేకాకుండా వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా ఎన్నో విధాలుగా సహాయపడుతుంది. ఆరోగ్యంగా ఉండటానికి పుచ్చకాయ తినడం తప్పనిసరి. తీవ్రమైన వేడిలో శరీరాన్ని తాజాగా ఉంచడానికి పుచ్చకాయ కంటే మంచిన మరో ప్రత్యామ్నాయం లేదంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే పుచ్చకాయలో 92 శాతం నీరు ఉంటుంది. ఇందులో విటమిన్లు, ఐరన్ కూడా పుష్కలంగా ఉంటాయి. పుచ్చకాయలో కేలరీల స్థాయి చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల మధుమేహ రోగులు కూడా పుచ్చకాయ హాయిగా తినవచ్చు. కాబట్టి ఎండ వేడిమికి చర్మం కమిలిపోకుండా ఉండాలంటే తియ్యని పుచ్చకాయ ముక్కలు తినాల్సిందే. ఫలితంగా మీ శరీరం ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉంటుంది. పుచ్చకాయ మాత్రమే కాదు పుచ్చకాయ గింజలు కూడా ఆరోగ్యానికి మేలు చేస్తాయి. చాలా మంది పుచ్చకాయ తినేటప్పుడు పొరపాటున గింజలను మింగేస్తుంటారు. దీనికి భయపడాల్సిన అవసరం లేదు. నిజానికి ఇది పొరపాటు కాదని నిపుణులు చెబుతున్నారు. పైగా పుచ్చకాయ గింజలను నేరుగా కూడా తినవచ్చు. పుచ్చకాయ గింజలలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా పుచ్చకాయ గింజలు ఆహారం త్వరగా జీర్ణం కావడానికి కూడా సహాయపడతాయి. చర్మంపై ముడతలను తగ్గించడానికి లేదా చర్మపు కాంతిని పెంచడానికి పుచ్చకాయ గింజలు అద్భుతంగా పనిచేస్తాయి. పుచ్చకాయ ముక్కలుగా కట్ చేసి, దాని గింజలను వేరు చేయాలి. ఆ తర్వాత దానిని ఎండలో ఆరబెట్టి, పొడి పెనంలో వేయించాలి. ఈ గింజలను నేరుగా నమిలి తినవచ్చు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత లేదా భోజనం తర్వాత తినవచ్చు. బరువు తగ్గాలనుకునేవారు మధ్యాహ్నం పూట చిరుతిండిగా పుచ్చకాయ గింజలను తినవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల ఆకలి తక్కువగా అనిపించి, వేగంగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అలాగే అన్నంతో పాటు పుచ్చకాయ గింజలను కూడా తినవచ్చు. దీనివల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది.

# కొబ్బరి నీళ్లలో ఈ గింజలు వేసుకుని తాగితే అమృతమే..



ఉదయం ఎనిమిది దాటిందంటేనే సూర్యుడు సెగలు గక్కుతున్నాడు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఉక్కపోత, విపరీతమైన చెమట మనలోని శక్తిని నిలువునా లాగేస్తున్నాయి. కేవలం నీళ్లు తాగినా తీరని దాహం.. ఇలాంటి తరుణంలో కోల్పోయిన శక్తిని తిరిగి ఇచ్చే ఎలక్ట్రోలైట్లు, శరీరాన్ని లోపలి నుండి చల్లబరిచే ఔషధం కావాలి. అదే కొబ్బరి నీరు – సబ్జా గింజల అద్భుత కలయిక. భానుడి భగభగలు మొదలయ్యాయి. వేసవి తీవ్రత పెరగడంతో అధిక చెమట, తీవ్రమైన అలసట, నీరసం సామాన్యులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం ఒక పెద్ద సవాలుగా మారింది. అయితే ప్రకృతి ప్రసాదించిన కొబ్బరి నీరు, చలువ చేసే సబ్జా గింజల మిశ్రమంతో ఈ సమస్యలకు సులువుగా చెక్ పెట్టవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. డీహైడ్రేషన్‌కు అద్భుత పరిష్కారం: ఎండల వల్ల శరీరంలోని ఎలక్ట్రోలైట్లు వేగంగా తగ్గిపోతాయి. కొబ్బరి నీటిలో ఉండే పొటాషియం, సోడియం, మెగ్నీషియం శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. వీటికి సబ్జా గింజలను జత చేస్తే, అవి నీటిని పీల్చుకుని జెల్ లాగా మారి, శరీరంలో ఎక్కువ సేపు తేమను నిలుపుతాయి. తద్వారా అలసట మాయమై, శరీరం రీఛార్జ్ అవుతుంది. జీర్ణక్రియకు రక్షణ కవచం: వేసవిలో వచ్చే గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలకు ఈ పానీయం ఒక దివ్యౌషధం. సబ్జా గింజల్లో ఉండే అధిక పీచుపదార్థం పేగులను శుభ్రపరిచి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొబ్బరి నీరు కడుపులోని మంటను తగ్గించి, ఎసిడిటీని నియంత్రణలో ఉంచుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి వరం: ఊబకాయం లేదా అధిక బరువుతో బాధపడేవారికి ఇది ఉత్తమ ఎంపిక. సబ్జా గింజలు తీసుకున్నప్పుడు కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తాయి, దీనివల్ల అతిగా తినే అలవాటు తగ్గుతుంది. కొబ్బరి నీటిలో కేలరీలు తక్కువగా ఉండటం వల్ల బరువు పెరిగే ప్రమాదం ఉండదు. చర్మ సౌందర్యం.. రెట్టింపు శక్తి: ఈ మిశ్రమం కేవలం ఆరోగ్యానికే కాదు చర్మ సౌందర్యానికి కూడా మేలు చేస్తుంది. శరీరంలోని విషతుల్యాలను బయటకు పంపడం ద్వారా చర్మం కాంతివంతంగా మారుతుంది. మధ్యాహ్న సమయంలో ఈ పానీయం తీసుకోవడం వల్ల రోజంతా చురుగ్గా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. కాబట్టి కూల్ డ్రింక్స్, సోడాల వంటి కృత్రిమ పానీయాల కంటే.. సహజసిద్ధమైన ఈ కొబ్బరి నీరు–సబ్జా గింజల మిశ్రమాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా ఈ వేసవిని ఆరోగ్యంగా ఎదుర్కోవచ్చు.

# ఏ విటమిన్ ఏ వ్యాధి నుంచి రక్షిస్తుంది?




విటమిన్లు అనేవి శరీరంలోని దాదాపు అన్ని విధులలో కీలక పాత్ర పోషించే ఆవశ్యక పోషకాలు. వాటి లోపం అనేక సమస్యలకు దారితీయవచ్చు. అందువల్ల, ఏ విటమిన్లు ఏ వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయో అర్థం చేసుకోవడం ముఖ్యం. విటమిన్లు శరీరానికి అవసరమైన పోషకాలు.. ఇవి మన మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. శరీరానికి శక్తిని అందించడానికి, అవయవాల సరైన పనితీరును నిర్వహించడానికి, రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. ప్రతి విటమిన్‌కు ఒక ప్రత్యేకమైన పని ఉంటుంది.. ఉదాహరణకు ఎముకలను బలోపేతం చేయడం.. మరికొన్ని చర్మ, కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

శరీరం చాలా విటమిన్లను స్వయంగా ఉత్పత్తి చేసుకోలేదు. కాబట్టి వాటిని ఆహారం ద్వారా పొందడం చాలా అవసరం. ఈ విటమిన్ల లోపం వివిధ ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. తగినంత మోతాదులో విటమిన్లను తీసుకోవడం శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా, అనేక వ్యాధులను నివారిస్తుంది.. శరీర పనితీరును మెరుగుపరుస్తుంది. అందువల్ల, సమతుల్య ఆహారంలో విటమిన్లను చేర్చడం చాలా కీలకం. ఏ విటమిన్లు ఏ వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయి..

ఎముకలు, కండరాల బలానికి విటమిన్ డి, బి12 చాలా అవసరం.. అవి బలాన్ని అందించి, బలహీనత, ఎముకలకు సంబంధించిన సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి.

విటమిన్ ఎ, విటమిన్ ఇ దృష్టి, చర్మ ఆరోగ్యాన్ని కాపాడటానికి సహాయపడతాయి. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలోనూ, కళ్ళను రక్షించడంలోనూ ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. గుండె, మెదడు సరిగ్గా పనిచేయడానికి విటమిన్ బి6, బి12 చాలా అవసరం. అవి రక్త ప్రసరణను మెరుగుపరిచి, మానసిక ఆరోగ్యానికి తోడ్పడతాయి. విటమిన్ లోపాలను గుర్తించడానికి నిర్దిష్ట రక్త పరీక్షలు నిర్వహిస్తారు. వీటిలో విటమిన్ డి, విటమిన్ బి12, ఐరన్ ప్రొఫైల్, కాల్షియం పరీక్షలు ఉంటాయి. మీ లక్షణాల ఆధారంగా వైద్యులు తగిన పరీక్షలను సిఫార్సు చేస్తారు. ఒక వ్యక్తికి తరచుగా అలసట, నీరసం, జుట్టు రాలడం లేదా చర్మ సమస్యలు వంటివి కనిపిస్తే, అది విటమిన్ లోపానికి సంకేతం కావచ్చు. క్రమం తప్పని వైద్య పరీక్షలు ఈ పరిస్థితిని నిర్ధారించి, తగిన చికిత్సను ప్రారంభించడానికి సహాయపడతాయి.

# బూడిద గుమ్మడి కాయ జ్యూస్ తాగుతున్నారా?





ఈ మధ్యకాలంలో బూడిద గుమ్మడికాయ జ్యూస్ ట్రెండింగ్‌లో ఉంది. చాలామంది ఉదయాన్నే పడిగడుపున దీనిని తాగుతున్నారు. అయితే.. బూడిద గుమ్మడి జ్యూస్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పచ్చి కూరగాయల జ్యూస్‌లలో ఉండే ఆక్సలేట్‌లు ఈ సమస్యకు కారణం కావచ్చు. యాంటీ–న్యూట్రియంట్‌లను తగ్గించడానికి ఉడకబెట్టి తాగడం ఉత్తమం. బూడిద గుమ్మడికాయ జ్యూస్ ఈ మధ్యకాలంలో చాలా ట్రెండీగా మారింది. ఆరోగ్యం కోసం చాలా మంది దీన్ని ఉదయాన్నే పడిగడుపున తాగుతున్నారు. అయితే, దీని వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలు, సురక్షితమైన వినియోగం గురించి అవగాహన ఉండటం చాలా ముఖ్యమంటు న్నారు ఆయుర్వేద నిపుణులు.. అన్ని కూరగాయలలో యాంటీ– న్యూట్రియంట్స్ ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.. ఇవి శరీరంలో విటమిన్ శోషణ, జీర్ణక్రియను ప్రభావితం చేయవచ్చు. బూడిద గుమ్మడికాయలో ఆక్సలేట్స్ అనే యాంటీ–న్యూట్రియంట్ అధికంగా ఉంటుంది. సుమారు 300–400 గ్రాముల బూడిద గుమ్మడికాయ ముక్కల నుండి తీసిన 200–300 ఎంఎల్ పచ్చి జ్యూస్‌లో ఆక్సలేట్ల సాంద్రత చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ అధిక ఆక్సలేట్ కంటెంట్ మనం ఆహారం ద్వారా తీసుకునే కాల్షియంతో కలిసి కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశాన్ని పెంచుతుందని పేర్కొంటున్నారు. ఇది అందరికీ రాకపోయినా, కొంతమందిలో ఆరోగ్య సమస్యలను సృష్టించగలదు. అందుకే, పడిగడుపున పచ్చి జ్యూస్ తాగడం అనేది అందరికీ సరైనది కాదని హెచ్చరిస్తున్నారు. ఆక్సలేట్ కంటెంట్‌ను తగ్గించడానికి బూడిద గుమ్మడికాయను ఉడకబెట్టి లేదా కొద్దిగా వేగించి జ్యూస్ చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.. ఇలా చేయడం వల్ల దానిలోని యాంటీ–న్యూట్రియంట్ ప్రొఫైల్ తగ్గి, విటమిన్లు ? ఖనిజాలు శరీరానికి మంచిగా అందుతాయి. పచ్చి కూరగా యల జ్యూస్‌లు దీర్ఘకాలంలో చెడు ప్రభావాలు చూపవచ్చని పేర్కొంటున్నారు.. శరీరాన్ని డిటాక్స్ చేస్తుందని చెప్పి అనేక రకాల జ్యూస్‌లను ప్రచారం చేస్తున్నారు. అయితే, కిడ్నీలు, లివర్, లింఫాటిక్ సిస్టం, చర్మం వంటి మన శరీర అవయవాలు సహజంగానే శరీరాన్ని డిటాక్స్ చేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. డిటాక్స్ జ్యూస్‌లు అనేది ఒక స్కామ్ అని, శరీరానికి నిజంగా ఏదైనా సమస్య ఉంటే డాక్టర్‌ను సంప్రదించా లని, జ్యూస్‌లు తాగడం వల్ల లాభం లేదని సూచిస్తున్నారు. సరైన జీవనశైలి, అంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం ద్వారా శరీరం దాని డిటాక్సిఫికేషన్ ప్రక్రియను సమర్థవంతంగా చూసుకుంటుందని గుర్తుచేస్తున్నారు. చాలా మంది జ్యూస్ తాగిన వెంటనే చురుకుగా ఉన్నట్లు భావిస్తారని, అది కేవలం శరీరానికి లభించే విటమిన్లు ? ఖనిజాల తాత్కాలిక ప్రభావం మాత్రమేనని పేర్కొంటున్నారు.

# ఈ పండ్లు తిన్నారంటే రోజంతా ఫుల్ ఖుష్



వేసవిలో చాలా మందికి నిస్సత్తువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. ఈ సమయంలో శరీరాన్ని ఎంత చల్లగా, తాజాగా ఉంచుకోవడానికి చాలా మంది శీతల పానియాలు, కొబ్బరి నీళ్లు వంటివి తీసుకుంటూ ఉంటారు. అయితే ఎండలో చెమట రూపంలో ఒంట్లోని నీరంతా ధారగా కారుతుంది. దీని కారణంగా డీహైడ్రేషన్ సమస్య తలెత్తుతుంది. వేసవిలో మండే ఎండలు త్వరగా శక్తిని కోల్పోయేలా చేస్తాయి. దీంతో నిస్సత్తువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. ఈ సమయంలో శరీరాన్ని ఎంత చల్లగా, తాజాగా ఉంచుకోవడానికి చాలా మంది శీతల పానియాలు, కొబ్బరి నీళ్లు వంటివి తీసుకుంటూ ఉంటారు. అయితే ఎండలో చెమట రూపంలో ఒంట్లోని నీరంతా ధారగా కారుతుంది. దీని కారణంగా డీహైడ్రేషన్ సమస్య తలెత్తుతుంది. వేసవిలో వచ్చే ఈ సమస్య నుంచి బయటపడటానికి అధిక నీటితో పాటు కొన్ని రకాల పండ్లను కూడా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ పండ్లను తినడం ద్వారా శరీరంలో తగినంత నీటి శాతాన్ని కాపాడుకోవడానికి అవకాశం ఉంటుంది. నారింజ పండ్లు నీరు అధిక శాతం ఉండే పండ్లు. వీటిల్లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. వీటిలోని అధిక నీటి శాతం వేడి వాతావరణంలో శరీరానికి మంచి హైడ్రేషన్‌ను అందిస్తుంది. అంతేకాకుండా వాటిలోని విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. వేసవిలో డీహైడ్రేషన్‌ను నివారించడానికి, శరీరంలో నీటి శాతాన్ని నిలుపుకోవడానికి పుచ్చకాయలను తినడం మంచి ఎంపిక. ఇందులో 92 శాతం నీరు ఉంటుంది. కాబట్టి ఇది వేసవికి అనువైన పండు. ఇది శరీరానికి తేమను అందించడమే కాకుండా ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంది. స్ట్రాబెర్రీలు తినడానికి రుచికరంగా ఉండటమే కాకుండా వాటిలో మంచి మొత్తంలో నీరు కూడా ఉంటుంది. విటమిన్ సిచ యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల స్ట్రాబెర్రీలు శరీరాన్ని ఫ్రీ రాడికల్ నష్టం నుంచి, వేడి నుంచి కాపాడతాయి. వేసవిలో దొరికే సీజనల్ పండ్లలో పనస ముఖ్యమైనది. ఇది మంచి సువాసనతో పాటు ఎన్నో మేలు చేసే పోషకాలు దండిగా కలిగి ఉంటుంది. తినడానికి ఈ పండు రుచికరంగా ఉండటమే కాకుండా, శరీరానికి తేమను కూడా అందిస్తుంది. అంతేకాకుండా అనాస పండులో మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ముఖ్యమైన పోషకాలు దండిగా ఉంటాయి. కీరదోసలో 96 శాతం నీరు ఉంటుంది. ఇది శరీరానికి మంచి హైడ్రేషన్‌ను అందిస్తుంది. కాబట్టి ఈ వేసవిలో ప్రతిరోజూ కీరదోస సలాడ్, లేదా జ్యూస్ ఎలా తీసుకున్నా మంచిదే.

# తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త



**హైదరాబాద్ :** తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఈ యేడాది 2.1 శాతం డిఏ పెంచుతున్నట్లుప్రకటించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ డీఏ లో పెంపు సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు శుభాకాంక్షలు. ఆర్టీసీ లో పెండింగ్ పనులు అభివృద్ధి కార్యక్రమాలపై పలు రీజియన్ లో ఆర్ ఎం లతో సమావేశాన్ని నిర్వహించి పెండింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించడం జరిగిందని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి ఉన్న ఏకైక పెండింగ్ డీఏ ను ప్రభుత్వం విడుదల చేసింది. జనవరి 2026 నుండి 2.1 శాతం పెరిగిన డీఏ అమలులోకి వచ్చింది... దీంతో సవరించిన డీఏ వల్ల 52.8 శాతానికి చేరింది. జనవరి నుండి ఇవ్వాల్సిన పెండింగ్ డీఏ లు భవిష్యత్ లో వచ్చే మూడు నెలలకు గాను ఒక్కో నెలలో విడుదల చేయడం జరుగుతుంది. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం లో మొదటి నుండి ఆర్టిసి సంస్థ పరిరక్షణ ,ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌల్యభం కేంద్రంగా పని చేస్తుంది. సంస్థకు ప్రధానంగా కార్మికుల సంక్షేమం పై వారికి సంబంధించిన ఆరోగ్య సంరక్షణ కు ఆసుపత్రి అప్గ్రేడేషన్ ,కారుణ్య నియామకాలు,దీర్ఘ కాలంగా రిమూవ్ అయిన వారిని త్రిమెన్ కమిటీ ద్వారా తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవడం ,కొత్త నియామకాలు చేపట్టి పని భారం తగ్గించడం ,కొత్త బస్సులు కొనుగోలు లాంటి అనేక కార్యక్రమాలు చేస్తుందని అన్నారు. పెండింగ్ లో ఉన్న డీఏ 2.1 శాతం పెంచడం వల్ల గతంలో ఉన్న 50.7 శాతం నుండి 52.8 శాతానికి పెరిగింది. తెలంగాణ లో ఉన్న ప్రతి ఆర్టీసీ ఉద్యోగులందరికీ ఇది ఉపయోగపడుతుంది. తెలంగాణ లో లైఫ్ లైన్ గా ఉన్న ఆర్టీసీ నీ మరింత ప్రజల్లోకి తీసుకెళ్లలా కృషి చేయాలి. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.

# అడుగంటుతున్న ఎల్లంపల్లి



**మంచిర్యాల :** మంచిర్యాల జిల్లాలో కల్పతరువులా ఉన్న 'శ్రీపాద ఎల్లంపల్లి'లో రోజురోజుకూ నీటి నిల్వలు తగ్గిపోతుండగా, కలవరం మొదలైంది. నీటి సరఫరా ఇలాగే కొనసాగితే నెలన్నరలో ప్రాజెక్టు అడుగంటి పోయి, మంచిర్యాలతో పాటు పెద్దపల్లి, హైదరాబాద్‌కు తాగు నీటికి ఇబ్బందులు తలెత్తే ప్రమాదమున్నది. ఈ విషయమై రెండు రోజుల క్రితం 'డేంజర్ బెల్స్' శీర్షికన 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం ప్రచురించగా, సిబ్బంది ఔట్‌ఫ్లోను కాస్త తగ్గించడం ప్రాధాన్యం సంతరించుకున్నది.

**తాగు నీటి సరఫరాకు ఇబ్బందులు తప్పవా..!**

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మొత్తం కెపాసిటీ 20.1754 టీఎంసీలు(148 మీటర్లు) కాగా, గురువారం నాటికి 10.4707 టీఎంసీల(143.88 మీటర్ల) నీరు ఉన్నది. ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ స్కీమ్‌కు 311 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, వేమునూరు పంప్‌హౌస్‌కు 247 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. ఇది కాకుండా మిషన్‌భగీరథ స్కీమ్ కింద రామగుండం గ్రిడ్‌కు, మంచిర్యాల గ్రిడ్‌కు కలిపి 80 క్యూసెక్కుల దాకా నీరు అవసరం అవుతున్నది

పంటలు కోత దశలో ఉన్న నేపథ్యంలో గూడెం పంప్‌హౌస్‌కు 290 క్యూసెక్కుల నీరు ఇస్తున్నారు. వీటన్నింటికీ ఇలాగే నీటిని సరఫరా చేస్తే నెలన్నర రోజుల్లోనే ఎల్లంపల్లి అడుగండిపోయి మంచిర్యాలతో పాటు అటు పెద్దపల్లి ముఖ్యంగా హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి. ఈ అంశపై 'నమస్తే తెలంగాణ' రెండు రోజులు క్రితం కథనం ప్రచురించిన నేపథ్యంలో ఔట్‌ఫ్లోను కాస్త తగ్గించారు. గురువారం ఎన్టీపీసీకి, నందీ పంప్‌హౌస్‌లకు నీటి సరఫరా చేయలేదని అధికారులు గణాంకాల్లో చూపించారు.

**గూడెంలిఫ్ట్ ఇంకా కొన్ని రోజులు నడిస్తే కష్టమే...**

కడెం ప్రాజెక్ట్ పరిధిలోని చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నుంచి 3 టీఎంసీలు నీళ్లు ఇవ్వాలనేది నిబంధన. దీని కింద దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కాకపోతే ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో 18 టీఎంసీల నీరు ఉంటేనే గూడెం లిఫ్ట్‌ను నడపాలి. కానీ, గత రెండు సంవత్సరాలు ఎండాకాలం ప్రారంభానికి ముందే ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో నీరు 18 టీఎంసీల కంటే దిగువకు చేరుతున్నది. స్థానిక రైతుల డిమాండ్ మేరకు 15 వేల ఎకరాల ఆరుతడి పంటలకు నీరు ఇస్తున్నారు.

ఈ మేరకు ఇప్పటికీ గూడెం లిఫ్ట్ నుంచి నీరు సరఫరా చేస్తున్నారు. గూడెం నుంచి 290 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. మరికొన్ని రోజుల్లో పంటలు కోతకు వచ్చే దశలో ఉన్నాయి. ఇప్పటికీ గూడెంకు ఎల్లంపల్లి నుంచి నీటిని ఇస్తున్నారు. గూడెం లిఫ్ట్‌ను అలాగే నడిపిస్తే తాగునీటికి ఇబ్బందులు తప్పేవనే అంచనాలు వినిపిస్తున్నాయి. గతేడాది, అంతకు ముందు ఏడాది దాదాపు ఇదే పరిస్థితి నెలకొన్నప్పుడు మంచిర్యాలకు తాగునీటి ఇబ్బందుల రాకుండా చర్యలు తీసుకున్నారు. ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నుంచి ప్రత్యేక కాలువలు తీసి పంప్‌హౌస్‌కు నీటి కొరత లేకుండా చూశారు. కానీ, ఈ సారి అలాంటి చర్యలు ఏవీ కనిపించకపోవడం ఆందోళనకరంగా మారింది.

**కాళేశ్వరం ఉంటే ఈ పరిస్థితి ఉండేనా..**

జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల్లోని దాదాపు 330 గ్రామ పంచాయతీలు, మరో 20 తండాలు, గూడేలకు ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోని మిషన్ భగీరథ గ్రిడ్ నుంచే తాగునీరు సరఫరా అవుతున్నది. జిల్లాలో ప్రతి రోజూ 6.75 ఎంఎల్‌డీ నీరు అంటే 0.09 టీఎంసీలు తాగడానికి కావాల్సి ఉంటుంది. మూడేళ్ల క్రితం దాకా ఎల్లంపల్లి ప్రాజెక్టులో పుష్కలమైన నీరు ఉండేది. కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా ప్రాజెక్టును నింపుకునే అవకాశం ఉండడంతో ఎల్లంపల్లిలోకి నీరు ఎత్తిపోసి సాగు, తాగునీటికి ఎలాంటి ఢోకా లేకుండా వాడుకునే వీలుండేది.

కాళేశ్వరంలో ఎత్తిపోస్తే ఎల్లంపల్లి నిండుకుండలా మారిపోయేది. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సాగునీటి నిర్వహణలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ ప్రాజెక్టును రిపేర్ చేయకపోవడంతో ఎల్లంపల్లి ఎండాల్సిన దుస్థితి వచ్చింది. దీంతో మూడేళ్ల క్రితం ఇదే సమయానికి బెడ్ లెవల్ నీటితో నిండుకుండను తలపించిన ఎల్లంపల్లి రోజురోజుకూ అడుగంటిపోతున్నది. ఎండల తీవ్రత ఇలాగే ఉండి, రోజూ ఇదే తరహాలో నీటిని తరలించాల్సి వస్తే మరో నెలన్నర రోజుల్లోనే ప్రాజెక్ట్ డెడ్ స్టోరేజీకి చేరుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు. అదే జరిగితే హైదరాబాద్‌తో పాటు పెద్దపల్లి, మంచిర్యాల పట్టణాలకు తాగునీటి ఇబ్బందులు తప్పేలా లేవు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోని మంచిర్యాల మిషన్ భగీరథ పంప్‌హౌజ్ ఉన్న ప్రాంతంలో ఇప్పటికే నీరు అడుగంటిపోయి కనిపిస్తున్నాయి.

**గతేడాది కంటే మెరుగైన పరిస్థితి**

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటి నిల్వలపై ఎల్లంపల్లి డీఈ బుచ్చిబాబును వివరణ కోరగా ప్రస్తుతం ఉన్న నిల్వలు జూలై దాకా సరిపోతాయన్నారు. గతేడాది ఈ సమయంతో పోలిస్తే ఈ ఏడాది రెండు టీఎంసీల నీరు అధికంగా ఉందన్నారు. యేటా ప్రాజెక్ట్‌లో ఉండే నీటి కంటే ఎక్కువ నిల్వలు ఉన్నందున సమస్య వచ్చు అవకాశాలే లేవన్నారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాగునీటికి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

# ఆడ పిల్లలను జన్మనిస్తుందనే సాకుతో భార్య ఇద్దరు పిల్లలను హత్య



**వరంగల్ :** రాష్ట్ర వ్యాప్తంగా సంచలంగా మారిన భార్య ఇద్దరు బాలికల హత్యకు సంబంధించి కేసులో హత్య గురైన మృతురాలి భర్తతో పాటు ఈ హత్యలకు పరోక్షంగా కారణంగా నిలిచిన మరో తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో వున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ప్రధాన నిందితుడు వరంగల్ జిల్లా, పున్నెలు గ్రామానికి చెందిన యం.డి అజారుద్దీన్ (29)తో పాటు, నిందితుడి కుటుంబ సభ్యులు పున్నెలు గ్రామానికి చెందిన యం.డి చాంద్పాషా (49), యం.డి సలీహా (45), యం.షరోద్దీన్ (25)లతో పాటు బసిక స్రవంతి (32), కడిపికొండ, బాల్నె పార్థు (47) నెక్కొండ, బొమ్మెర మనోహర్(39), గీసుగొండ, లింగాల నరేష్(37), కొండపర్తి, సాట్లరాజు (32), పున్నెలు, వాకుదోట్ భద్రు (60), ఎనుగల్లు చెందిన వారిని పోలీసులు అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు డా. బాల్నె పూర్ణిమ, డా. ఎస్.రవళీ పరారీలో వున్నారు. ఐనవోలు మండలం పున్నెలు గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు అజారుద్దీన్ ఇదే గ్రామానికి చెందిన మృతురాలు ఫరహాత్ను 2016 సంవత్సరంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు హుమేరా (09), ఆయేషా (06) వున్నారు. తరువాత మృతురాలు గర్భం దాల్చడంతో తిరిగి అడ పిల్లకు జన్మనిస్తుందనే రెండు దఫాలు నిందితుడు మృతురాలికి అబార్షన్ చేయించడం జరిగింది. ఇదే సమయంలో నిందితుడి దూరపు బంధువైన మైనర్ బాలికపై ప్రేమ పెంచుకున్న నిందితుడు పెళ్ళి చేసుకుంటానని మైనర్ బాలికకు నిందితుడు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసాడు.నీకు ఇంతకు ముందే పెళ్ళి అయి ఇద్దరు పిల్లలు వున్నారు. నేను నిన్న పెళ్ళి చేసుకోనని మైనర్ బాలిక నిరాకరించడంతో, తనకు భార్య పిల్లలు వుండటం కారణంగానే మైనర్ బాలిక పెళ్ళి అంగీకరించడం లేదని భార్య పిల్లలపై కక్ష్య పెంచుకున్నాడు తను ప్రస్తుతం ప్రేమిస్తున్న బాలికను పెళ్ళి చేసుకోవాలంటే భార్య, పిల్లలు బ్రతికుండగా సాధ్యం కాదని, వారిని చంపడం ద్వారా ఇది సాధ్యమని నిర్ణయించుకున్నాడు నిందితుడు. ఇందుకోసం నిందితుడు తాను అనుకున్న ప్రణాళిక ప్రకారం ఈ నెల 1వ తారీఖు రాత్రి సుమారు 7.50 గంటలకు ఐసు క్రీం తినిపిస్తానని భార్య పిల్లలను తాను నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్ వద్దకు కారులో తీసుకరావడం జరిగింది. ప్రణాళిక ప్రకారం నిందితుడు ముందుగానే స్విమ్మింగ్ పూల్ వద్ద సిసి కెమెరాలు, కరెంటు నిలిపి వేయడంతో స్విమ్మింగ్ చేరుకున్న మృతులను నిందితుడు బలవంతంగా స్విమ్మింగ్లోకి నెట్టివేసి స్విమ్మింగ్ పూల్లో పడిపోయిన భార్య పిల్లలను బలవంతంగా వారు చనిపోయేవరకు వారిని నీటిలో ముంచి దారుణంగా హత్య చేసాడు.

ఈ ముగ్గురిని హత్య చేసిన అనంతరం నిందితుడు వీరు మరణించినట్లుగా నిర్ధారించుకొని తన భార్య పిల్లలు స్విమ్మింగ్ పూల్లో పడి మృతి చేందారని ప్రచారం చేశాడు. మృతిరాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు తమకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకొని నిందితుడు అజారుద్దీన్ తన భార్య పిల్లలను దారుణంగా హత్య చేసినట్లుగా నిర్ధారణకు వచ్చారు. పట్టుబడిన నిందితుల్లో స్రవంతి పై మూడు కేసులు, డా. పార్థు మీద నాలుగు కేసులు, ప్రస్తుతం పరారీ లో వున్న డా. పూర్ణిమ పై నాలుగు కేసులు ఉన్నట్లుగా పోలీసులు వెల్లడించారు.

## ప్రియురాలికి హెచ్ఐవీ రక్తం ఘటనలో విషాదం.. అవమానం, బాధతో యువతి ఆత్మహత్య

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఇటీవల ఓ యువకుడు తన ప్రియురాలికి హెచ్ఐవీ ఇంజెక్షన్ ఇచ్చిన ఘటనలో విషాదం చోటుచేసుకుంది. పెళ్లికి నిరాకరించిందనే కోపంతో ఓ యువకుడు యువతికి బలవంతంగా హెచ్ఐవీ సోకిన రక్తాన్ని ఎక్కించగా, ఆ మనస్తాపంతో బాధిత యువతి తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చిన్ననాటి నుంచి ప్రేమించిన వ్యక్తే తన జీవితాన్ని ఇలా నాశనం చేశాడన్న బాధతో ఆమె ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది.జనగామ జిల్లాకు చెందిన యువకుడు హైదరాబాద్‌లో ట్రాన్స్‌పోర్ట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతడి తల్లిదండ్రులిద్దరికీ హెచ్ఐవీ పాజిటివ్ ఉండగా, తండ్రి గతంలోనే మరణించాడు. సమీప బంధువైన యువతిని అతడు ప్రేమించగా, పెద్దలు కూడా పెళ్లికి అంగీకరించారు. అయితే, వివాహానికి ముందు యువతి తండ్రి జరిపించిన రక్త పరీక్షల్లో యువకుడికి కూడా హెచ్ఐవీ ఉన్నట్లు తేలింది. దీంతో యువతి కుటుంబ సభ్యులు ఈ పెళ్లిని రద్దు చేసుకున్నారు. కుమార్తె జీవితాన్ని తెలిసి నాశనం చేయలేమని, యువకుడి కుటుంబానికి వారు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.వివాహం రద్దవడాన్ని జీర్ణించుకోలేకపోయిన నిందితుడు, తాను ప్రేమించిన యువతికి కూడా హెచ్ఐవీ సోకితే మరెవరూ పెళ్లి చేసుకోరని, అప్పుడు కచ్చితంగా తననే చేసుకుంటుందని వికృతంగా ఆలోచించాడు. మార్చి నెల 11న తన రక్తాన్ని సిరంజీలోకి తీసుకుని, యువతి ఇంటికి వెళ్లి ఆమె నిరాకరించడంతో బలవంతంగా ఆ రక్తాన్ని ఎక్కించి పారిపోయాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, ప్రాణాంతక వ్యాధి సోకిందన్న ఆందోళన, సమాజంలో ఎదురయ్యే అవమానం తట్టుకోలేక ఆ యువతి ప్రాణాలు తీసుకోవడం అందర్నీ కలచివేస్తోంది. తన తప్పు లేకున్నా, ఆమె చనిపోయిందని తెలియడంతో స్థానికంగా విషాదం నెలకొంది.ఈ ఘటనలో ఆ యువకుడు దారుణమైన తప్పిదం చేశాడు. ప్రేమించిన యువతి హాయిగా ఉండాలని ఆలోచించలేదు. తన కుటుంబంతో పాటు తనకు హెచ్ఐవీ ఉందని గమనించి సైలెంట్ గా ఉండలేదు. అదే కారణంతో తనను రిజెక్ట్ చేయడం, పెళ్లి రద్దు కావడంతో ఆమెను ఎలాగైనా దక్కించుకోవాలని ప్రమాదకర హెచ్ఐవీ రక్తాన్ని ఆమెకు బలవంతంగా ఇంజెక్ట్ చేశాడు. అలా చేస్తే ఆమె నిజంగానే అతడ్ని పెళ్లి చేసుకుంటుందా? నేరస్తుడిగా జైలుకు వెళ్తానని మాత్రం ఆలోచించలేకపోయాడు. ఆ అవమాన భారంతోనో, లేక భయంతోనే యువతి ఏదైనా తీసుకోకూడదని నిర్ణయం తీసుకుంటే పరిస్థితి ఏంటని కూడా థింక్ చేయలేదు. అతడి వికృత నిర్ణయం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఆ తల్లిదండ్రులకు కన్నీళ్లే మిగిల్చించింది. పెళ్లి చేసి అత్తింటికి పంపాలని భావించిన తల్లిదండ్రులు కూతుర్ని శ్మశానానికి సాగనంపి, ఆమెకు తుది వీడ్కోలు పలకాల్సి రావడం కంటే నరకం ఇంకేమైనా ఉంటుందా అని స్థానికులు, నెటిజన్లు అంటున్నారు. తనకు దక్కనిది ఎవరు దక్కకూడదని భావించే వాళ్లు, దక్కించుకునేందుకు ఏదైనా పిచ్చి పనులు చేస్తే వారికి కఠిన శిక్షలు వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## హైదరాబాద్‌లో 75 శాతం రౌడీషీటర్లకు డ్రగ్స్ పాజిటివ్

**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో రెగ్యూలర్ గా హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు తనిఖీలు జరుగుతున్నాయి. హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా పోలీసులు ఒక భారీ ఆపరేషన్ చేపట్టారు. సిటీ వ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు, వారిలో డ్రగ్స్ అలవాట్లు ఏ మేరకు ఉన్నాయో తెలుసుకునేందుకు ప్రత్యేకంగా డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ తనిఖీలు నగరంలోని నేరస్తులకు వణుకు పుట్టిస్తున్నాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరం మొత్తం మీద సుమారు 1300 మంది రౌడీ షీటర్లను గుర్తించారు. వీరిలో ప్రాథమిక దశలో 250 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా,గ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. డ్రగ్స్ పరీక్షలు జరిపిన 250 మందిలో ఏకంగా 190 మందికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలడం కలకలం రేపుతోంది. అంటే దాదాపు 75 శాతం మంది రౌడీ షీటర్లు మత్తు పదార్థాలకు బానిసలయ్యారని స్పష్టమైంది.వీరిలో అత్యధిక శాతం మంది గంజాయికి అలవాటు పడినట్లు పోలీసులు గుర్తించారు. రౌడీ షీటర్లు మత్తులో ఉండి తీవ్రమైన నేరాలకు పాల్పడే అవకాశం ఉండటంతో పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. వీరికి గంజాయి ఎక్కడి నుండి సరఫరా అవుతోంది? దీని వెనుక ఉన్న ప్రధాన నెట్‌వర్క్ ఏమిటి? వీరు డ్రగ్స్, గంజాయి ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారు అనే కోణంలో పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టారు.

## జీవన్ రెడ్డి రాజ్యసభ పదవి వదులుకొన్నారు

**హైదరాబాద్ :** జగిత్యాల జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీ కోసం శ్రమించిన టి జీవన్ రెడ్డి త్వరలో బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. జీవన్ రెడ్డి పార్టీని వీడటం బాధాకరమని, ఓ మంచి అవకాశాన్ని కోల్పోయారని నేతలు చెబుతున్నారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్‌ను వీడటంపై దానం నాగేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జగిత్యాల మాజీ ఎమ్మెల్యే టి. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వెళ్లడం ఒక తొందరపాటు చర్య అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే దానం నాగేందర్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనను పార్టీలోనే కొనసాగేలా చేసేందుకు చివరి నిమిషం వరకు ఎంతో ప్రయత్నించారని ఆయన పేర్కొన్నారు. జీవన్ రెడ్డికి తదుపరి విడతలో రాజ్యసభ సీటు ఇచ్చే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నప్పటికీ, ఆయన ఓపిక పట్టకుండా ఎమోషనల్‌గా నిర్ణయం తీసుకుని బీఆర్ఎస్ పార్టీలో చేరనుండటం దురదృష్టకరమని దానం వ్యాఖ్యానించారు.పార్టీ సీనియర్ నాయకుడిగా జీవన్ రెడ్డి ఎన్నో సేవలు అందించారని, అటువంటి నేత పార్టీని విడటం బాధాకరమని దానం నాగేందర్ అన్నారు. ఖైరతాబాద్‌లోని పెద్ద గణేష్ విగ్రహం వద్ద 99 రోజుల ప్రజా పాలన ఉత్సవాల్లో భాగంగా, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ప్రియాంకతో కలిసి నిర్వహించిన "ఫ్రైడే డ్రైడే" ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు.ఇదే క్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై దానం నాగేందర్ విమర్శలు గుప్పించారు. సమస్యల పరిష్కారం కంటే పబ్లిసిటీకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. కేవలం ప్రచారం కోసమే దోమతెరలు వేసుకుని బయట తిరుగుతున్నారని సుధీర్ రెడ్డిని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలి తప్ప, ఇలాంటి విన్యాసాలు చేయకూడదని ఆయన హితవు పలికారు. సంబంధిత అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లాలని, వారు పరిష్కరించేందుకు కృషి చేస్తారని తెలిపారు. కానీ ఒక్కరోజు స్టంట్స్, పబ్లిసిటీ పిచ్చితో ఏదో ఒకటి చేస్తే వైరల్ అవుతారు తప్పా, పనులు మాత్రం కావని సూచించారు.

## తిరుమలగిరి గ్రంధాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్ :** నేటి తరానికి జ్ఞానాన్ని సమకూర్చేందుకు గ్రంథాలయాల ఆవశ్యకత ఎంతైనా ఉందని కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్ అన్నారు.తిరుమలగిరి లాల్ బజార్ లో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రారంభించారు. కోటి యాభై లక్షల రూపాయల నిధులతో గ్రంథాలయాన్ని నిర్మించి విద్యార్థులకు యువతకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ గ్రంథాలయం మూలంగా వచ్చే సమాచార సేకరణ, విషయ పరిజ్ఞానం యువతకు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో బోయిన్ పల్లి, బొల్లారంలో సైతం గ్రంథాలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. గ్రంథాలయంలో అన్ని రకాల వసతులు కల్పించామని విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రంథాలయంలో తన సొంత నిధులతో అధ్యాపకులను మార్గదర్శకులుగా నియమించి కంటోన్మెంట్ యువతకు భావితరాలకు గొప్ప భవిష్యత్తును అందించేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసి కోర్టులలో కేసులు వేసి నిరుద్యోగులను మోసం చేసిందని ప్రజాపాలన ప్రభుత్వం ఇప్పటికే వేల సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులకు అండగా నిలిచిందని పేర్కొన్నారు.

# బిజినెస్

## ఇకపై గంట ఆలస్యంగా రూ. 10,000 పైన డిజిటల్ చెల్లింపులు




దేశంలో డిజిటల్ మోసాలు నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకోనుం ది. ముఖ్యంగా యూపీఐ లావాదేవీలకు సంబంధించి అకౌంట్ నుంచి అకౌంట్‌కు బదిలీ చేసే అధిక మొత్తం లావాదేవీలను గంటసేపు నిలిపివేసేందుకు ఆర్‌బీఐ ప్రతిపాదించింది. 'డిజిటల్ చెల్లింపుల్లో భద్రతా చర్యల అన్వేషణ' చర్చా పత్రంలో ఆర్‌బీఐ ఈ మేరకు ప్రతిపాదనలు పేర్కొంది. ఇందుకు రూ. 10,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన డిజిటల్ లావాదేవీలను ప్రాసెస్ చేయడానికి ఒక గంట ఆలస్య నిబంధనను ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ఈ సమయంలో, వినియోగదారులకు లావాదేవీని రద్దు చేసుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ లావాదేవీ అనుమానాస్ప దంగా అనిపిస్తే, దాన్ని కొనసాగించడానికి ముందు బ్యాంక్ కస్టమర్ నుంచి రీ-కన్ఫర్మేషన్ తీసుకోవలసి ఉంటుంది. మర్చంట్ పేమెంట్స్, ఓటీటీ లేదా ఇతర సబ్‌స్క్రిప్షన్, లోన్, ఇన్సూరెన్స్ వంటి లావాదేవీలు, చెక్కులకు మినహాయింపు ఉంటుంది.

## టాప్ 100 ప్రైవేట్ సంస్థల్లో రిలయన్స్ రిటైల్ 7వ స్థానం




ప్రపంచంలోనే అత్యంత విలువైన ప్రైవేట్ స్టార్టప్ కంపెనీల జాబితాలో రిలయన్స్ రిటైల్ ఏడో స్థానంలో నిలిచింది. స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ రీసెర్చ్ ప్రకారం, 100 బిలియన్? డాలర్ల(రూ. 9.24 లక్షల కోట్ల)కు పైగా విలువతో రిలయన్స్ రిటైల్ ఈ ఘనతను సొంతం చేసుకుంది. రిలయన్స్ రిటైల్ 'పోస్ట్-మనీ వాల్యుయేషన్' 100 బిలియన్? డాలర్లను దాటింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా 100 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన ఏడు కంపెనీల గ్రూపు హెక్టాకార్న్లులో చేరింది. టాప్-7లో రిటైల్ రంగానికి చెందిన ఏకైక కంపెనీ రిలయన్స్ రిటైల్ కావడం విశేషం. ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, జీఐసీ, టీపీజీ, కేకేఆర్ వంటి గ్లోబల్ ఇన్వెస్టర్ల నుంచి కంపెనీకి పెట్టుబడులు వచ్చాయి. ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలు నిర్ణయించిన విలువ ద్వారానే ర్యాంకింగ్స్ కేటాయించారు. రిలయన్స్ రిటైల్‌తో పాటు, భారత్‌కు చెందిన మరో రెండు కంపెనీలు వెంచర్ క్యాపిటల్ మద్దతున్న టాప్-100 జాబితాలో ఉన్నాయి. 24 బిలియన్ డాలర్ల వాల్యుయేషన్‌తో ఎన్‌ఎస్ఈ ఇండియా 27వ స్థానం, 9 బిలియన్ డాలర్ల వాల్యుయేషన్‌తో టాటా ఈవీ 93వ స్థానంలో ఉన్నాయి.

# ఫార్మాకు ముడిపదార్థాల సరఫరా పెంపు



పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో, ఔషధ రంగానికి అవసరమైన కీలక ముడిపదార్థాల సరఫరాను ప్రభుత్వం పెంచుతోంది. దేశీయంగా ప్రాణరక్షక ఔషధాల తయారీలో ఆటంకాలు ఎదురవ్వకుండా చూసేందుకు ప్రాధాన్యమిస్తోంది. పశ్చిమాసియా యుద్ధానికి ముందు, ఔషధ రంగానికి ముడిపదార్థాలు గుజరాత్‌లోని కాండ్లా నౌకాశ్రయం ద్వారా అధికంగా వచ్చేవి. అక్కడి నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలి వెళ్లేవి. యుద్ధం వల్ల ఈ దిగుమతులకు అవరోధాలు ఎదురవుతున్నాయి. అయినా కూడా ఔషధ రంగానికి కీలకమైన ప్రొపిలీన్, అమ్మోనియా, మీథేన్ వంటి వాటిని, ప్రాధాన్యతకు అనుగుణంగా, దామాషా పద్ధతిలో ఔషధ సంస్థలకు అందిస్తున్నట్లు ఔషధశాఖ సంయుక్త కార్యదర్శి టీఎల్ సత్యప్రకాశ్ వెల్లడించారు. ప్రొపిలీన్‌ను భారత్ పెట్రోలియం కార్పొరేషన్ సహా దేశీయ రిఫైనరీలే ఔషధ కంపెనీలకు అందిస్తున్నాయని తెలిపారు. ఐబ్రూఫిన్ వంటి ఔషధాలకు కావాల్సిన ఐసోప్రొపైల్ ఆల్కహాల్, ఐసోబుటైల్ బెంజీన్ వంటి ఇంటర్మీడియెట్ల తయారీ కోసం ప్రొపిలీన్‌ను వినియోగిస్తారు. అమ్మోనియాను ఎరువుల రంగం నుంచి బదిలీ చేస్తున్నారు. ఇటీవల మెథనాల్ లభ్యతపై ఆందోళన నెలకొంది. అయితే అస్సాం పెట్రోకెమికల్స్, గుజరాత్ నర్మదా వ్యాలీ ఫెర్టిలైజర్స్ దీనిని ఔషధ కంపెనీలకు సరఫరా చేస్తున్నాయి.ఏప్రిల్ 1 నుంచి 40 పెట్రో రసాయనాలపై కస్టమ్స్‌ను ప్రభుత్వం తొలగించింది. దీనివల్ల ఔషధ సంస్థలకు తయారీ వ్యయాలు అదుపులోకి వస్తాయి. దాదాపు స్థిరంగానే ధరలు: ఔషధ రంగానికి కీలకమైన సాల్వెంట్స్, యాక్టివ్ ఫార్మా ఇంగ్రేడియెంట్ల సరఫరాలో అంతర్జాతీయంగా ఆటంకాలు ఎదురవుతున్నా, దేశీయంగా ఔషధ ధరలు దాదాపు స్థిరంగానే ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. మందుల తయారీలో వాడే మెట్‌ఫామిన్, ఆస్పిరిన్ వంటి ఇంటర్మీడియెట్ల ధరల కదలికలను చురుగ్గా గమనిస్తామని సత్యప్రకాశ్ వివరించారు. మార్ఫోలిన్ వంటి వాటిపై నాణ్యతా నిబంధనలను, మందుల ప్యాకేజింగ్‌కు వాడే అల్యూమినియంపై నిబంధనలనూ తాత్కాలికంగా సడలించినట్లు తెలిపారు. ఎల్‌పీజీ, హైస్పీడ్ డీజిల్ సరఫరాలు కూడా తగినన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు.

## రిఫైనరీ మార్జిన్లపై పరిమితి దేశీయ ఇంధన విక్రయాలపై నష్టాలు తగ్గించడానికే




దేశీయంగా ఇంధన సరఫరా మెరుగు పరచేందుకు, ఎగుమతులపై విండ్‌ఫాల్ పన్ను విధించిన ప్రభుత్వం.. తాజాగా రిఫైనరీ మార్జిన్లపై పరిమితి విధిస్తోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధర బాగా పెరిగినా, దేశీయంగా పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను సవరించలేదు. దీనివల్ల చము రు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీ) భారీగా నష్టపోతు న్నాయి. ముడిచమురును శుద్ధి చేసి, పెట్రోల్ – డీజిల్ వంటి ఇంధనాలుగా మార్చే రిఫైనరీలు మాత్రం.. ఓఎంసీలకు దిగుమతి ధర ప్రకారమే సరఫరా చేయడం ఇందుకు నేపథ్యం. ఓఎంసీలకు నష్టాలు తగ్గించేందుకే రిఫైనరీ మార్జిన్లలో కోత విధించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. దేశీయ సరఫరాల్లో కొరత నివారణకు: అంతర్జాతీయంగా చమురు సరఫరాల్లో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దేశీయంగా కూడా ఈ ప్రభావం పడుతోంది. ముడిచమురును ఇక్కడ శుద్ధి చేసి, విదేశాలకు పెట్రో ఉత్పత్తులను ఎగుమతి చేస్తే కంపెనీలకు అధిక లాభం వస్తుంది. అయితే సరఫరాలు తక్కువగా ఉన్నందున, దేశీయంగా కొరత తలెత్తకుండా చూసేందుకు గత నెలలో డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్) ఎగుమతులపై ప్రత్యేక అదనపు సుంకాన్ని (ఎస్‌ఏఈడీ) ప్రభుత్వం విధించింది. దీంతో పాటు రిఫైనింగ్ మార్జిన్‌ను బ్యారెల్‌కు 15 డాలర్లకు పరిమితం చేసినట్లు సమాచారం. ఇప్పటికే లీటరుకు రూ.60 తగ్గించి ఇస్తున్న ఓఎంసీలు: రిఫైనరీలు దిగుమతి చేసుకుని, తమకు విక్రయించే పెట్రోలియం ఉత్పత్తులపై లీటరుకు రూ.60 వరకు తగ్గించి చెల్లించాలని చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) ఇప్పటికే నిర్ణయించాయి. మార్చి ద్వితీయార్థానికి లీటర్ డీజిల్‌పై రూ.22.34, ఏప్రిల్ తొలి పక్షం రోజులకు రూ.60.24 తగ్గించి చెల్లిస్తున్నారు. ఏటీఎఫ్‌పై లీటరుకు రూ.50.56 రాయితీ, కిరోసిన్‌పై లీటరుకు రూ.46.31 తగ్గిస్తున్నట్లు సమాచారం.

## భారత వృద్ధి రేటు అంచనా 6.6శాతం




2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు అంచనాల ను స్వల్పంగా పెంచి 6.6 శాతానికి సవరించినట్లు ప్రపంచ బ్యాంక్ తెలిపింది. ప్రారంభంలో జీఎస్‌టి రేట్ల తగ్గింపు వినియోగదారుల డిమాండ్‌ను పెంచినప్పటికీ పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తే ప్రతికూల పరిస్థితులు వృద్ధిలో కోత విధించవచ్చని పేర్కొంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వృద్ధి అంచనాలను ఆర్‌బిఐ 6.9శాతం, ఒఇసిడి 6.1శాతం, మూడీస్ రేటింగ్స్ 6శాతంగా అంచనా వేసిన సంగతి తెలిసిందే. ప్రపంచ బ్యాంక్ బుధవారం 'దక్షిణాసియా ఆర్థిక నివేదిక'ను విడుదల చేసింది. బలమైన దేశీయ డిమాండ్, ఎగుమతుల పటిష్టత కారణంగా, భారతదేశ వృద్ధి రేటు 2025లో నమోదైన 7.1శాతం నుండి 2026 ఆర్థిక సంవత్సరంలో 7.6శాతానికి వేగవంతమవుతుందని అంచనా వేసింది. తక్కువ ద్రవ్యోల్బణం, వస్తు సేవల పన్ను ( జిఎస్‌టి) క్రమబద్ధీకరణతో వ్యక్తిగత వినియోగ వృద్ధి వేగవంతమైందని పేర్కొంది. "పశ్చిమాసియా యుద్ధం కారణంగా నెలకొన్న ప్రతికూలతల కారణంగా 2027 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 6.6శాతానికి తగ్గుతుందని అంచనా వేస్తున్నాము" అని నివేదిక పేర్కొంది.

# రికార్డులు కొల్లగొట్టిన రాజస్తాన్ చిన్నోడు!

# స్పోర్ట్స్




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఎందరో అనామక క్రికెటర్లను వెలుగులోకి తీసుకొచ్చింది. తాజాగా లక్నో సూపర్‌జెయిం?ట్స్ యువ కెరటం ముకుల్ చౌదరి కూడా అదే జాబితాలో చేరాడు. గురువారం కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ముకుల్ చౌదరి 27 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్సర్ల సాయంతో 54 పరుగులు నాటౌట్ మెరుపు ఇన్నింగ్స్ ఆడి లక్నోకు ఒంటిచేత్తో విజయాన్ని అందించాడు. ఈ నేపథ్యంలో ముకుల్ చౌదరి రెండు రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. ఆ రికార్డులేంటో ఇప్పుడు ఒకసారి పరిశీలిద్దాం. కేకేఆర్‌తో మ్యాచ్‌లో ముకుల్ చౌదరి ఏడు సిక్సర్లు బాదాడు. ఏడు లేదా ఆ తర్వాతి స్థానాల్లో బ్యాటింగ్‌కు వచ్చి అత్యధిక సిక్సర్లు బాదిన తొలి లక్నో బ్యాటర్‌గా నిలిచాడు. ఈ నేపథ్యంలో సీఎస్‌కే ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో సరసన చేరాడు. బ్రావో ఐపీఎల్ 2018 సీజన్‌లో ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో ఏడు సిక్సర్లు బాదాడు. ఇదే మ్యాచ్‌లో ముకుల్ చౌదరి.. అవేశ్‌ఖాన్‌తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 54 పరుగులు జోడించాడు. తద్వారా ఐపీఎల్‌లో టార్గెట్‌ను విజయవంతంగా ఛేదించిన జట్లలో లక్నోకు 8వ వికెట్‌కు అత్యధిక పరుగుల భాగస్వామ్యం అని చెప్పొచ్చు. ఇక లక్నో సూపర్‌జెయింట్స్‌కు కేకేఆర్‌పై ఇది ఐదో విజయం. ఇప్పటివరకు ఏడు మ్యాచ్‌ల్లో తలపడితే అందులో ఈడెన్ గార్డెన్స్ వేదికగానే లక్నో నాలుగు మ్యాచ్‌లు గెలవడం విశేషం.

## ఐపీఎల్ నిరాకరణ తర్వాత పీఎస్‌ఎల్‌లో చరిత్ర




బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రహ్మాన్ ఇూా 2026లో చోటు కోల్పోయిన తర్వాత, పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో ఓ భారీ రికార్డు సొంతం చేసుకున్నాడు. దాయాది లీగ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్స్ లాహోర్ ఖలందర్స్‌కు ఆడుతున్న ముస్తాఫిజుర్.. నిన్న (ఏప్రిల్ 9) ఇస్లామాబాద్ యునైటెడ్‌తో జరిగిన మ్యాచ్‌లో 2 డాట్ బాల్స్ వేయడంతో పొట్టి క్రికెట్‌లో అత్యంత అరుదైన 3000 డాట్ బాల్స్ మైలురాయిని అధిగమించాడు.
తద్వారా పొట్టి క్రికెట్ చరిత్రలో ఈ ఘనత సాధించిన ఐదో బౌలర్‌గా చరిత్రకెక్కాడు. ముస్తాఫిజుర్‌కు ముందు డ్వేన్ బ్రావో (3681), మొహమ్మద్ ఆమిర్ (3348), ఆండ్రీ రస్సెల్ (3213), సోహైల్ తన్వీర్ (3046) మాత్రమే ఈ ఘనత సాధించారు. ముస్తాఫిజుర్ 3000 డాట్ బాల్స్ మైలురాయిని తాకిన మ్యాచ్‌లో అతని జట్టు లాహోర్ ఖలందర్స్ ఓటమిపాలైంది. ఆ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఖలందర్స్ 18.3 ఓవర్లలో 100 పరుగులకే ఆలౌటైంది. ఇస్లామాబాద్ బౌలర్లు మూకుమ్మడిగా రాణించి ఖలందర్స్‌ను కుప్పకూల్చారు. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనను ఇస్లామాబాద్ 10.2 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి ఆడుతుపాడుతూ ఛేదించింది. డెవాన్ కాన్వే (59) అజేయ అర్ధ సెంచరీతో ఇస్లామాబాద్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఇదిలా ఉంటే, ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ నుంచి అత్యంత సున్నితమైన పరిణామాల మధ్య తొలగించారు. 2026 సీజన్ కోసం జరిగిన వేలంలో అతన్ని కేకేఆర్ రూ. 9.2 కోట్ల భారీ మొత్తానికి సొంతం చేసుకోగా.. భారత్-బంగ్లాదేశ్ మధ్య జియో పొలిటిలక్ ఉద్రిక్తతల కారణంగా బీసీసీఐ అతని ఐపీఎల్ కాంట్రాక్ట్‌ను రద్దు చేసింది. దీంతో ముస్తాఫిజుర్ పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో లాహోర్ ఖలందర్స్‌తో ఒప్పందం చేసుకున్నాడు.

## మ్యాచ్ మధ్యలో ఫ్లైట్ ఎక్కి వెళ్లిపోయిన సౌతాఫ్రికా ప్లేయర్



దక్షిణాఫ్రికా దేశవాలీ క్రికెట్‌లో సంచలన పరిణామం చోటు చేసుకుంది. లయన్స్ అనే ఫ్రాంచైజీ తమ ఆల్‌రౌండర్ బేయర్స్ స్వానెపోల్‌ను సస్పెండ్ చేసింది. ఓ టోర్నీ ఫైనల్ మ్యాచ్ మధ్యలో వేదికను వదిలి వెళ్లిపోయినందుకు లయన్స్ యాజమాన్యం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. తొలుత బేయర్స్ గాయం కారణంగా మైదానాన్ని వీడాడని అంతా అనుకున్నారు. చివరికి అతను ఏకంగా వేదికనే వీడి యూకే విమానం ఎక్కినట్లు తెలిసింది. విషయం తెలిసి రిఫరి 10 మందితోనే మ్యాచ్ కొనసాగించాలని లయన్స్‌ను ఆజ్ఞాపించాడు. బేయర్స్ మైదానం వీడే సమయానికి మ్యాచ్ నువ్వా-నేనా అన్నట్లు సాగుతుంది. బేయర్స్ గైర్హాజరీలో లయన్స్ 10 మందితోనే మ్యాచ్ కొనసాగించలేక, చివరి బంతి వరకు పోరాడి ఓటమిపాలైంది. ఆ మ్యాచ్‌లో బేయర్స్ ఉండి ఉంటే, ఫలితం లయన్స్‌కు అనుకూలంగా వచ్చేది. ఆ మ్యాచ్‌లో బేయర్స్ బంతితో అద్భుతంగా రాణించి (3-44) లయన్స్‌ను మ్యాచ్‌లో నిలిపాడు. అయితే కీలక తరుణంలో హ్యాండ్ ఇచ్చి లయన్స్ ఓటమికి కారకుడయ్యాడు. ఇంతకీ బేయర్స్ అంత అర్జెంట్‌గా విమానం ఎక్కి యూకేకు ఎందుకు వెళ్లాడని ఆరా తీయగా.. అతను వోర్సెస్టర్‌షైర్ కౌంటీతో ఒప్పందంలో భాగంగా అలా చేశాడని తెలిసింది. ఆ విమానం మిస్ అయితే వోర్సెస్టర్‌షైర్‌తో ఒప్పందం ఉల్లంఘన జరుగుతుందని అలా చేసినట్లు బేయర్స్ స్వయంగా చెప్పాడు. బేయర్స్ చర్యను చాలా సిరీయస్‌గా తీసుకున్న లయన్స్ యాజమాన్యం అతని కాంట్రాక్ట్‌ను రద్దు చేసింది. బేయర్స్ అంత సాహసం ఎందుకు చేశాడని ఆరా తీయగా మరో సంచలన విషయం కూడా బయటపడింది. అతను క్రికెట్ సౌతాఫ్రికా నుంచి ఎన్‌వోసీ కూడా లేకుండానే యూకేకు పయనమైనట్లు తెలిసింది. ఈ చర్య వల్ల బేయర్స్ సౌతాఫ్రికా జాతీయ జట్టు తరఫున ఆడే అవకాశం కూడా కోల్పోతాడు. బేయర్స్ కౌంటీ ఛాన్స్ కోసం చూసుకొని ఫ్రాంచైజీతో పాటు క్రికెట్ సౌతాఫ్రికా ఆగ్రహానికి గురయ్యాడు. ఈ మొత్తం ఉదంతంపై బేయర్స్ స్పందించాడు. లయన్స్ యాజమాన్యానికి, అభిమానులకు, క్రికెట్ సౌతాఫ్రికాకు క్షమాపణలు చెప్పాడు. ఈ కౌంటీ సీజన్ నాకు చాలా ప్రత్యేకం. అందుకే అలా చేయక తప్పలేదని వివరణ ఇచ్చాడు.



# చరిత్రను తిరగరాసిన రణ్‌వీర్ సింగ్..

**రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరిన మొదటి బాలీవుడ్ సినిమాగా 'ధురంధర్ 2'**

బాలీవుడ్ చిత్ర పరిశ్రమలో సరికొత్త చరిత్ర ఆవిష్కృతమైంది. స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా, దర్శకుడు ఆదిత్య ధర్ రూపొందించిన భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేటను కొనసాగిస్తూ సరికొత్త మైలురాయిని అధిగమించింది. గతంలో 'బాహుబలి 2', 'పుష్ప 2' వంటి చిత్రాలు అన్ని భాషల్లో కలిపి భారీ వసూళ్లు సాధించినప్పటికీ, కేవలం హిందీ వెర్షన్‌లోనే రూ.1000 కోట్ల నెట్ వసూళ్లను సాధించిన మొదటి భారతీయ చిత్రంగా 'ధురంధర్ 2' రికార్డు సృష్టించింది. ఈ ఘనత సాధించిన తొలి బాలీవుడ్ చిత్రంగా ఇది చరిత్రలో నిలిచిపోనుంది. ఈ సినిమా విడుదలైన నాటి నుంచే థియేటర్ల వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న సంగతి తెలిసిందే. ట్రేడ్ అనలిస్టుల అంచనాలను తలకిందులు చేస్తూ, కేవలం 21 రోజుల్లోనే రూ.1041 కోట్ల నికర వసూళ్లను రాబట్టింది. ఇక ప్రపంచవ్యాప్తంగా గ్రాస్ వసూళ్ల విషయానికి వస్తే, ఈ చిత్రం ఇప్పటికే రూ.1665 కోట్ల మార్కును దాటి తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. 2025లో బ్లాక్‌బస్టర్ హిట్ సాధించిన 'ధురంధర్'కు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం, కథా బలంతో పాటు అబ్బురపరిచే యాక్షన్ సీక్వెన్స్‌లతో ప్రేక్షకులను కట్టిపడేసింది. రణ్‌వీర్ సింగ్ తన కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్‌కు తోడు, సంజయ్ దత్, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ వంటి దిగ్గజ నటుల కలయిక సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సారా అర్జున్, రాకేష్ బేడీ తమ నటనతో సినిమాకు వెన్నుముకగా నిలిచారు.

## రావు బహదూర్' నుంచి ఫస్ట్ సింగిల్ అప్‌డేట్



వైవిధ్యమైన కథలు ఎంచుకుంటూ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నలేటెస్ట్ చిత్రం 'రావు బహదూర్'. 'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ దర్శకుడు వెంకటేష్ మహా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే వచ్చిన టీజర్, ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ ఫస్ట్ లుక్, టీజర్ ఆధారంగా ఇది ఒక విభిన్నమైన పీరియడ్ డ్రామా అని, సత్యదేవ్ తన కెరీర్‌లో డిఫరెంట్ రోల్ చేస్తున్నారని అర్థం అవుతుంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు ఓ కూల్ పోస్టర్ రిలీజ్ చేస్తూ.. 'ప్రేమకు అంకితం, ప్రేమ నుండే పుట్టిన గీతం 'ఓ సుందరి'.. 'రావు బహదూర్' నుంచి ఫస్ట్ సింగిల్ ఓ సుందరి ఏప్రిల్ 15న విడుదలవుతోంది' అని తెలిపారు. ఇక విడుదల చేసిన పోస్టర్‌లో హీరో అండ్ హీరోయిన్ లుక్ కూల్‌గా ఆకట్టుకుంటోంది. కాగా.. మహేష్ బాబు, నమ్రత సమర్పిస్తున్న ఈ చిత్రం క్షీణిస్తున్న కులీన వర్గాల నేపథ్యంతో సాగుతుంది. ఇందులో సత్యదేవ్‌తో పాటు దీప థామస్, ఆనంద్ భారతి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 2026 సమ్మర్ టార్గెటా ఈ చిత్రం రిలీజ్‌కు సిద్ధం అవుతుండగా.. డేట్ త్వరలో ప్రకటించనున్నారు మేకర్స్.



# మనకు దక్కాల్సినవి సరైన సమయం వచ్చినప్పుడే దక్కుతాయి..

మలయాళ ముద్దుగుమ్మ మమితా బైజు.. ప్రజెంట్ బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా ఆఫర్స్ అందుకుంటూ బిజీ లైఫ్ లీడ్ చేస్తుంది. ఆమె నటిస్తున్న వరుస ప్రాజెక్టులలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఒకటి. కోలీవుడ్ వర్సటైల్ యాక్టర్ సూర్య, సెన్సిబుల్ డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రాబోతున్న ఈ ప్రాజెక్టు సంబంధించిన షూటింగ్ ప్రజెంట్ శరవేగంగా జరుగుతున్నది. ఇందులో భాగంగానే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని సినిమాపై ఆసక్తికర కామెంట్స్ చేసింది మమిత. 'విశ్వనాథ్ అండ్ సన్స్ చిత్రంలో ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు బలమైన ఎమోషనల్ కంటెంట్ కూడా ఉంటుంది. ఇది ఒక సంపూర్ణ వినోదాత్మక చిత్రంగా రూపొందగా.. ఈ చిత్రం ప్రేక్షకులకు పూర్తిస్థాయిలో ఎగ్జైట్‌మెంట్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. నన్ను నమ్మండి.. ఈ సినిమా అద్భుతంగా ఉండబోతోంది' అని తెలిపింది. అలాగే తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ.. 'నేను మలయాళ చిత్రసీమలో నా ప్రయాణాన్ని ఒక సహాయ నటిగా ప్రారంభించాను. ఇప్పుడు ప్రధాన పాత్రల వైపు అడుగులు వేస్తున్నాను. ప్రతి విషయాన్ని దశలవారీగా ముందుకు తీసుకెళ్లడాన్ని నేను విశ్వసిస్తాను.. ఎందుకంటే మనకు దక్కాల్సినవి సరైన సమయానికి తప్పక మనల్ని చేరుతాయి' అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది మమిత.

# రాజశేఖర్ ఫిట్‌నెస్ సీక్రెట్



టాలీవుడ్ సీనియర్ హీరో రాజశేఖర్ ఈ మధ్యే తన సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టి వరుస సినిమాలతో ప్రేక్షకులను పలకరిస్తున్నాడు. కొంత కాలం క్రితం నితిన్ హీరోగా రూపొందిన ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్ చిత్రంలో కీలకమైన పాత్రలో నటించి ప్రేక్షకులను అలరించాడు. ఈ చిత్రం బాక్స్ ఆఫీస్ దగ్గర ఫెయిల్యూర్ అయింది. తాజాగా శర్వానంద్ ప్రధాన పాత్రలో రూపొందిన బైకర్ చిత్రంలో ఈయన శర్వానంద్ కి తండ్రి పాత్రలో నటించాడు. ఈ మూవీలోని రాజశేఖర్ పాత్రకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. ప్రస్తుతం రాజశేఖర్ వయస్సు 64 సంవత్సరాలు, అయినా కూడా ఈ సీనియర్ నటుడు ఎంతో ఫిట్‌గా, అందంగా కనబడుతున్నాడు. దాంతో ఈయన ఎలాంటి డైట్ పాటిస్తాడు అని తెలుసుకోవాలి అనే ఉత్సాహం జనాల్లో బాగానే ఉంది. తాజాగా రాజశేఖర్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అందులో ఆయన రోజు ఎలాంటి ఫుడ్ తీసుకుంటారు అనేది క్లియర్గా చెప్పుకొచ్చాడు. రాజశేఖర్ మాట్లాడుతూ... నేను రోజు తీసుకునే ఆహారం విషయంలో ఎక్కువ శాతం పండ్ల రసాలకు ప్రాముఖ్యత ఇస్తాను. రోజులో వాటిని ఎక్కువ మోతాదులో తీసుకుంటాను. కేవలం మంచి ఫుడ్ తీసుకోవడం మాత్రమే కాకుండా రోజులో కొన్ని గంటల పాటు వ్యాయామం కూడా చేస్తుంటాను. దాని ద్వారా కూడా మన శరీరం ఎంతో బాగుంటుందని, ఇలా మంచి డైట్, శరీరానికి తగిన ఎక్సర్సైజ్ రెండూ సమాన స్థాయిలో మెయింటెన్ చేయడం వల్లే తాను ఈ వయసులో కూడా అందంగా ఉన్నట్లు రాజశేఖర్ తాజాగా చెప్పుకొచ్చారు.

# రూ.10 కోట్లు పెడితే రూ.100 కోట్లు.. మలయాళంలో హిట్టు కొట్టిన తెలుగు నిర్మాత




మలయాళంలో రెండేళ్ల క్రితం సంచలన విజయం సాధించిన చిత్రాల్లో "వాళా" ఒకటి. కేవలం రూ.4 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ ఏకంగా రూ.40 కోట్లు వసూలు చేసింది. వాళా అంటే మలయాళంలో అరటి మొక్క అని అర్థం. అలాగే పనీపాటా లేకుండా తిరిగే సోమరులని కూడా అదే పేరుతో పిలుస్తారు. వాళా చిత్రానికి 'బయోపిక్ ఆఫ్ బిలియన్ బాయ్స్' అనేది ట్యాగ్‌లైన్ ఇచ్చారు.

**మలయాళంలో హిట్ కొట్టిన తెలుగు డైరెక్టర్**

2024లో వచ్చిన ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'వాళా 2' వచ్చింది. 'బయోపిక్ ఆఫ్ బిలియన్ బ్రోస్' అనేది ఉపశీర్షిక. ఈ రెండు భాగాలకు కథ అందించింది విపిన్ దాస్ ఒక్కరే అయినా.. దర్శకులు మాత్రం మారారు. మొదటి భాగానికి ఆనంద్ మీనన్ దర్శకత్వం వహించగా రెండో భాగాన్ని సవిన్ డైరెక్ట్ చేశాడు. సీక్వెల్‌కు రూ.10 కోట్ల బడ్జెట్ కేటాయించారు. తెలుగు నిర్మాత సాహు గారపాటి ఈ సినిమా నిర్మాతల్లో ఒకరిగా ఉన్నాడు.

**సెంచరీ కొట్టిన వాళా 2**

ఏప్రిల్ 2న విడుదలైన ఈ చిత్రం ఏకంగా సెంచరీ కొట్టింది. కేవలం వారం రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిపోవడం విశేషం. ఈ ఏడాది మన శంకరవరప్రసాద్‌గారుతో హిట్ అందుకున్న సాహు గారపాటి.. మూడు నెలల్లో వాళా 2తో మరో బ్లాక్‌బస్టర్ అందుకున్నాడు. కాగా వాళా మొదటి భాగం హాట్‌స్టార్‌లో మలయాళంతో పాటు తెలుగులోనూ అందుబాటులో ఉంది.




# వరుణ్ తేజ్ కొరియన్ కనకరాజు నుంచి ఫస్ట్ సింగిల్ ప్రోమో!

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'కొరియన్ కనకరాజు' ఇండో-కొరియన్ నేపథ్యంలో హారర్-కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఈ చిత్రంలోని మొదటి పాట 'కమ్సాహంనిదా' ప్రోమోను తాజాగా విడుదల చేయగా, దీనికి విశేష స్పందన లభిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్, వరుణ్ తేజ్ మరియు దర్శకుడు మేర్లపాక గాంధీ మధ్య సాగే ఫన్నీ సంభాషణలతో కూడిన ఈ ప్రోమో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది. మెలోడీ కింగ్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పూర్తి పాటను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలకమైన వినోదాత్మక పాత్రలో అలరించనున్నారు. కొరియా సంస్కృతికి మరియు లోకల్ క్యారెక్టర్ అయిన కనకరాజుకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తన మార్కు వినోదంతో వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. ఇప్పటికే మేజర్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఆఖరి షెడ్యూల్‌ను దక్షిణ కొరియాలోని అందమైన లొకేషన్లలో పూర్తి చేసుకోబోతుంది. యూవీ క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ, ప్రమోద్ మరియు విక్రమ్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ ఈ డిఫరెంట్ కథాంశంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాను 2026 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com